# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :283 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 21-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఇందిరమ్మ రాజ్యంలో పేదల జీవితాల్లో వెలుగులు

హైదరాబాద్, ఇందిరమ్మ రాజ్యంలో పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మినిస్టర్ క్వార్టర్స్ లో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ, క్యాలండర్‌ను ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఆ సంస్థ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గ్యారెంటీలు పథకాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు ఐదు లక్షల రూపాయల స్కీమ్‌తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి, సీనియర్ నాయకులు కంది రవీందర్ రెడ్డి, వైస్ ప్రసిడెంట్ భాస్కర్ రెడ్డి, కుమార్, రమేష్, రఘు, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా రైతు మహాధర్నా చేపట్టి తీరుతాం



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి పాలన చేతకాక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల నిరసనను అడ్డుకుంటున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి(జగదీష్ రెడ్డి) అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో బీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు(రైతు మహాధర్నా) పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పని చేయటం పార్టీల హక్కు అని తెలిపారు. తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఏ కార్యక్రమం తీసుకున్నదని ప్రభుత్వం అడ్డుకుంటున్నదని. కేటీఆర్ ఏ కార్యక్రమం చేపట్టిన రేవంత్ రెడ్డికి ఎందుకు వణుకు పుడుతుందని ప్రశ్నించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కండ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతులు పంట చేలకు నిప్పు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ రైతు దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తుంది. రేపు నల్గొండలో సభ నిర్వహించమంటే ఈ రోజు పోలీసులు అనుమతి నిరాకరించారు. చేసిన వాగ్దానాలు అమలు చేయడానికి ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతుంటే అనుమతులు నిరాకరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

కుట్రలను తిప్పికొడుతాం..

పోలీసుల తీరును తప్పు పడుతూ కోర్టుకు ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు. గతంలో కూడా కుంటి సాకులు చెప్పి అనుమతులు నిరాకరిస్తే కోర్టుకు వెళ్లి మరీ శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. కేటీఆర్ ఎక్కడికి వెళ్లినా శాంతియుతంగా ప్రజలు కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంత అడ్డుకున్నా రేపటి దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో బీఆర్ఎస్(బీఆర్ఎస్) పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నెల 21న పట్టణాన్ని క్లాక్ టవర్ సెంటర్ వద్ద జరుగనున్న ఈ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించి జిల్లా నాయకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో గ్రామ సభలు, సంక్రాంతి సందర్భంగా బందోబస్తు ఇవ్వలేమంటూ జిల్లా పోలీసులు ధర్నాకు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి కోసం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

## దావోస్‌లో తెలంగాణ-ఏపీ సీఎంలు.. అస్త్రాలు రెడీ

హైదరాబాద్, తమ రాష్ట్రాలకు పెట్టుబడులు రప్పించడమే లక్ష్యంగా ఏపీ-తెలంగాణ ముఖ్యమంత్రులు దావోస్‌లో అడుగుపెట్టారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తోపాటు కీలక వ్యక్తులను తమతో తీసుకెళ్లారు. తమ రాష్ట్రానికి వస్తే ఎలాంటి సదుపాయాలు ఉంటాయనే దానిపై క్లియర్‌గా వివరించనున్నారు. గడిచిన పదేళ్లు దావోస్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు అక్కడికి వెళ్లడం ఇదే తొలిసారి. పెట్టుబడులు రప్పించేందుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు పోటీ పడుతున్నాయి. 130 దేశాల నుంచి 3 వేల మంది నాయకులు, 1600 మంది బిజినెస్‌మేన్లు, 100కు పైగా టెక్ దిగ్గజాలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పెట్టుబడులు ఆకట్టుకునేందుకు రాష్ట్రాలకు ఇదే సరైన అవకాశం అన్నమాట. సీఎం రేవంత్‌రెడ్డి టీమ్ పక్కా ప్లాన్‌తో దావోస్‌కి వెళ్లింది. తెలంగాణకు వచ్చేసరికి ఫోర్త్ సిటీకి పెట్టుబడులు రప్పించేందుకు కృషి చేస్తున్నారు. రెండుసార్లు విదేశీ పర్యటనలు తమకు అనుకూలిస్తుందన్నది ప్రభుత్వం ఆలోచన. ఫ్యూచర్ సిటీకి ఉన్న అడ్వాంటేజ్‌లను పారిశ్రామిక వేత్తలకు వివరించనుంది. దీనికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సిద్ధం చేసింది. హైదరాబాద్‌లో గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అలాగే ట్రాన్స్‌పోర్టు సదుపాయాలు, స్కిల్ యూనివర్సిటీ వంటి ప్రాముఖ్యతను వందలాది మంది పారిశ్రామిక వేత్తలకు వివరించనుంది. టీ హబ్, ఇతర ఐటీ కంపెనీలు రావడానికి కృషి చేసిన ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ వెళ్లడం తెలంగాణకు అడ్వాంటేజ్. ఎందుకంటే గతంలో ఆయన చాలాసార్లు దావోస్ కు వెళ్లారు. అది కూడా కలిసి వస్తుందని భావిస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ సదస్సుకు భారతదేశం నుండి అత్యధిక సార్లు హాజరైన నేతల్లో ఒకరు. 20వ దశకంలో దావోస్ వేదికగా అనేక పెట్టుబడులను ఆకర్షించారు. హైటెక్ సిటీ నిర్మించడం,




ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానించారు. ఆయన సాధించిన గొప్ప విజయాలలో కీలకమైనవి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రతీ ఏడాది దావోస్‌కు వెళ్తున్నారు. ఆయనకు అక్కడి వెళ్లిన నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉండే పలువురు పారిశ్రామిక వేత్తలతో మంచి సంబంధాలున్నాయి. గతంలో తమిళనాడు ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డులో వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు సరిన్ పరాపరకత్. ఆయన కాలంలో తమిళనాడుకు పెట్టుబడులు వెల్లువెత్తాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సరిన్ పరాపరకత్ ఏరి కోరి ఏపీకి తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు వీసీగా ఆయనను నియమించారు. ఏపీకి విశాలమైన కోస్తా తీరం, కొత్త రాజధాని అమరావతి, ఐటీ హబ్‌కు కేరాఫ్‌గా విశాఖను పరిచయం చేయనున్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్, గ్రీన్ ఎనర్జీ యూనిట్ నెలకొల్పడం లాంటి అంశాలు ప్రస్తావించే అవకాశముంది. ఎటు చూసినా పెట్టుబడులను రప్పించేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య పోటీ నెలకొందనే చెప్పవచ్చు.

## యుద్ధ భూమిలో శాంతి కపోతం .. 93 మంది బందీలు విడుదల

సెంట్రల్ డెస్క్:ఇజ్రాయెల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఒప్పందం స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.30గంటలకు అమల్లోకి రావాల్సి ఉండగా..దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. హమాస్ నుంచి ఇజ్రాయెల్ బందీల జాబితా విడుదలలో జాప్యం కావడంతో తొలుత శాంతి ఒప్పందం అమలుపై సందిగ్ధత నెలకొంది. చివరకు ఇజ్రాయెల్ కు చెందిన ముగ్గురు బందీలను హమాస్ విడుదల చేసింది. గాజాకు చేరుకున్న రెడ్ క్రాస్ ప్రతినిధులకు ఈ బందీలను అప్పగించింది. హమాస్ విడుదల చేసిన బందీల్లో రోమి గోనెన్ (24), ఎమిలీ దమారీ (28), డోరాన్ స్టెయిన్ బ్రేచర్ (31)లు ఉన్నారు. వారిని రెడ్ క్రాస్ ప్రతినిధులు ఇజ్రాయెల్ సైన్యానికి అప్పగించారు. ఇజ్రాయెల్ బందీలు సొంత గడ్డపై అడుగు పెట్టగానే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ.. బందీల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. బందీల విడుదల దృశ్యాలను వీక్షించేందుకు టెల్ అవీవ్ లో వేల సంఖ్యలో ప్రజలు గుమ్మికూడారు. ఇందుకోసం రోడ్లపై పలుచోట్ల పొడవైన స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన సందర్భంగా గాజాలో ప్రజలు ర్యాలీలు తీశారు. చాలా మంది ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్తున్నారు. ఒప్పందంలో భాగంగా 90మంది పాలస్తీనా ఖైదీలతో కూడిన మొదటి బ్యాచ్ ఇజ్రాయెల్ కస్టడీ నుంచి విడుదలయ్యారు. వారిలో మైనర్లు, మహిళలు ఉన్నారని పాలస్తీనా అధికారులు తెలిపారు. రాళ్లు విసరడం, హత్యాయత్నం వంటి నేరాలకు పాల్పడినందుకు ఇజ్రాయెల్ వీరిని అరెస్టు చేసింది. అయితే, మొదటి దశలో కాల్పుల విరమణ 42రోజుల పాటు కొనసాగుతుంది. ఈ దశలో 33 మంది బందీలు, దాదాపు 2వేల మంది పాలస్తీనా ఖైదీలు దశల వారిగా విడుదలవుతారని భావిస్తున్నారు. ఒప్పందంలో భాగంగా మొదటి దశలో ఇజ్రాయెల్ దళాలు జనావాస ప్రాంతాల నుంచి



వైదొలుగుతాయి. అదేవిధంగా గాజాలోకి ఆహారం, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను అందించేందుకు ఇజ్రాయెల్ సైన్యం అనుమతిస్తుంది. రెండో దశలో మిగిలిన బందీలను హమాస్ విడుదల చేస్తుంది. అయితే, రెండో దశ సమయానికి ఇజ్రాయెల్, హమాస్ మధ్య మళ్లీ యుద్ధవాతావరణం నెలకుంటుందా అనే ఆందోళనసైతం వ్యక్తమవుతుంది. హమాస్ ఈ ఒప్పందాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరుకుంటుంది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పై హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 46,000 మందికిపైగానే పాలస్తానీయులు మృతిచెందారు. అయితే, దాదాపు పదిహేను నెలలుగా సాగుతున్న యుద్ధానికి తాజాగా కాల్పుల విరమణ ఒప్పందంతో తెరపడింది.

## తెలంగాణలో పడిపోయిన ఉష్ణోగ్రతలు.. సింగిల్ డిజిట్‌కే పరిమితం



హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల తర్వాత ఇవాళ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

## అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు భారీ ఊరట

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా , బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేఎ కార్యకర్త నవీన్ ఝా పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జారండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన



దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార?ండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝాకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

## ఆరోపణలపై పోరాడేందుకు న్యాయ సంస్థల నియామకం




న్యూఢిల్లీ,అదానీ గ్రూప్ ఇటీవల అమెరికాలో తనపై వచ్చిన ఆరోపణలను న్యాయబద్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఈమేరకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ దాఖలు చేసిన సివిల్, క్రిమినల్ కేసులను నిర్వహించడానికి కిర్క్లాండ్ & ఎల్లిస్, క్విన్ ఇమ్మాన్యుయేల్ ఉర్కుహార్ట్ & సుల్లివాన్ ఎల్ఎల్‌పీ అనే న్యాయ సంస్థలను అదానీ గ్రూప్ నియమించింది.

అసలేం జరిగిందంటే..

అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు చెల్లించిందన్న ఆరోపణలున్నాయి. దాంతో అమెరికాలోని పెట్టుబడిదారులు కూడా ఏజీఈఎల్‌లో ఇన్వెస్ట్ చేయడంతో కంపెనీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి యూఎస్‌లోని ఎస్ఈసీ, ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ ప్రాథమిక దర్యాప్తు జరిపి సివిల్, క్రిమినల్ కేసులు పెట్టింది. వాటిని ఎదుర్కొనేందుకు అదానీ గ్రూప్ తాజాగా రెండు సంస్థలను నియమించింది. ఇవి కంపెనీపై వచ్చిన ఆరోపణలపై న్యాయబద్ధంగా అక్కడి కోర్టుల్లో సమాధానం చెప్పనున్నాయి.

కేసు నేపథ్యం..

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియానుంచి కాంట్రాక్టులు పొందడానికి ఏజీఈఎల్‌కు అనైతికంగా సాయపడటానికి భారత అధికారులకు లంచం ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దాంతో అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ, ఇతర ఎగ్జిక్యూటివ్‌లపై 2024 నవంబర్ 21న అమెరికా అధికారులు అభియోగాలు మోపారు. ఈ ఆరోపణలు ఉన్నప్పటికీ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వినీత్ ఎస్ జైన్‌లపై యూఎస్ ఫారిన్ కరప్షన్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) ఉల్లంఘనలకు సంబంధించి అభియోగాలు మోపలేదని ఏజీఈఎల్ నొక్కి చెప్పింది.

న్యాయ సంస్థల గురించి

షికాగోలో ప్రధాన కార్యాలయం ఉన్న కిర్క్టాండ్ %ు% ఎల్లిస్ అధికంగా వాణిజ్య వివాదాలు, మేధో సంపత్తి వ్యాజ్యాలు, వైట్-కాలర్ కేసుల్లో ప్రత్యేకత కలిగి ఉంది. ఇప్పటికే జాన్సన్ %ు% జాన్సన్, వోక్స్ వ్యాగన్ వంటి ప్రధాన సంస్థలకు ఈ సంస్థ సేవలందించింది. లాస్ ఏంజిల్స్‌కు చెందిన క్విన్ ఇమ్మాన్యుయేల్ సెక్యూరిటీస్ లిటిగేషన్, ప్రొడక్ట్ లయబిలిటీ, రెగ్యులేటరీ ఇన్వెస్టిగేషన్‌ల్లో ప్రసిద్ధి చెందింది. ఈ కంపెనీకి గూగుల్, యాపిల్, ఉబెర్ వంటి క్లయింట్లు ఉన్నారు.

### అర్ధరాత్రి విద్యార్థిని బయటికి పంపిన శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం!

ఫీజు కట్టలేదన్న కారణంగా శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం అర్ధరాత్రి ఓ విద్యార్థిని బయటికి పంపేసింది. విద్యార్థి తండ్రి రాత్రికి రాత్రే రూ.20,000 ఫీజు చెల్లించి..తన కుమారుడిని లోపలి అనుమతించాలని కోరినా యాజమాన్యం కనికరించలేదు. దాంతో ఇక చేసేది లేక తండ్రి కొడుకులు ఇద్దరు అర్ధరాత్రి కాలేజీ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఘటన కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడులో చోటుచేసుకుంది. ఆబోతు గౌతమ్ అనే విద్యార్థి కంకిపాడు సమీపంలో శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు ముగించుకొని.. తండ్రి ఆబోతు టార్జాన్‌తో కలిసి హైదరాబాద్ నుంచి రాత్రి కళాశాలకు చేరుకున్నాడు. ఫీజు చెల్లించాలని యాజమాన్యం చెప్పడంతో..టార్జాన్ రాత్రి రూ.20,000 ఫీజు చెల్లించాడు. మిగతా ఫీజు కూడా కడితేనే కళాశాలలోకి అనుమతిస్తామని యాజమాన్యం చెప్పింది. తన దగ్గర డబ్బులు లేవని,తర్వాత కడతామని ఎంత వేడుకున్నా

## పోలీసులు సంక్షేమం కోసమే పెట్రోల్ బంకులు ఏర్పాటు



హైదరాబాద్,పోలీసులు సంక్షేమం కోసమే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారక తిరుమల రావు అన్నారు. నాన్ పోలీసుల సంక్షేమానికి కూడా తోడ్పాటుగా ఉంటుందన్నారు. పోలీస్ పెట్రోల్ బంక్‌లో ఖచ్చితమైన నాణ్యత ప్రమాణాలు ఉంటాయని, ప్రజలు ఈ బంకుల్లో పెట్రోల్ కొట్టించుకొని పోలీస్ శాఖకు సహకరించాలని డీజీపీ కోరారు. ఈరోజు రాజమహేంద్రవరంలో పెట్రోల్ బంక్‌ను ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రారంభించారు. లాలా చెరువు సమీపంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు అయింది.

పెట్రోల్ బంక్ ప్రారంభం అనంతరం డీజీపీ ద్వారక తిరుమల రావు మాట్లాడుతూ 'డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటిపై డ్రోన్ ఎగురవేసిన ఘటనపై విచారణ కొనసాగుతుంది. నిన్న సాయంత్రానికే విచారణ పూర్తి కావాల్సింది. మరో రోజు అదనంగా విచారణకు సమయం కోరారు. విజయనగరం జిల్లా ఏజెన్సీలో పవన్ కళ్యాణ్ పర్యటనలో నకిలీ పోలీసు అధికారి, ఇంటిపై డ్రోన్ ఘటనలను వేరువేరుగా చూస్తున్నాం. గతం కంటే ఈసారి సంక్రాంతికి కోడి పందాలు ఎక్కువగా జరిగిన విషయం నా దృష్టికి రాలేదు. కోడి పందాలకు సంబంధించి కేసులు అయితే ఎక్కువగానే నమోదు చేశాం. పోలీసులు సంక్షేమం కోసమే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నాం. నాన్ పోలీసులు కూడా సంక్షేమానికి తోడ్పాటుగా ఉంటుంది. పోలీస్ పెట్రోల్ బంక్‌లో ఖచ్చితమైన నాణ్యత ప్రమాణాలు ఉంటాయి. ప్రజలు ఈ బంకుల్లో పెట్రోల్ కొట్టించుకొని పోలీస్ శాఖకు సహకరించండి' అని కోరారు.

## సంపాదకీయం

**మంగళవారం 21-01-2025**

# గాజాలో శాంతి సాధ్యమేనా!

బాంబుల మోత ఆగుతుందంటే... తుపాకులు మౌనం పాటిస్తాయంటే... క్షిపణుల జాడ కనబడదంటే... ఇనుప డేగల గర్జనలు వినబడవంటే... నిత్యం మృత్యువు వికటాట్టహాసం చేస్తున్నచోట హర్షాతిరేకాలు వ్యక్తం కావటం సహజమే. అందుకే 15 నెలలుపైగా... అంటే 467 రోజులుగా రాత్రింబగళ్లు ప్రాణభయంతో కంటి మీద కునుకు లేకుండా గడిపిన గాజా ప్రజానీకం వీధుల్లోకొచ్చి పండుగ చేసుకున్నారు. అటు హమాస్ చెరలో మగ్గుతున్నవారి కుటుంబసభ్యులు సైతం ఆనందో త్సాహాలతో ఉన్నారు. ఇజ్రాయెల్%-%మిలిటెంట్ సంస్థ హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని మధ్యవర్తులుగా వ్యవహరించిన అమెరికా, ఖతార్ ప్రతినిధులు బుధవారం రాత్రి ప్రకటించగానే ప్రపంచం, ప్రత్యేకించి పశ్చిమాసియా ఊపిరి పీల్చుకున్నాయి. 'నేను దేశాధ్యక్షపదవి స్వీకరించబోయే జనవరి 20 నాటికి బందీలకు స్వేచ్ఛ లభించకపోతే సర్వనాశనం ఖాయ'మని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పక్షం రోజుల నాడు ప్రకటించారు. 'నా హెచ్చరిక ఫలించబట్టే కాల్పుల విరమణ ఒప్పందం సాకారమైంద'ని ఇప్పుడు ఆయన అంటుంటే... 'నా అనుభవంలోనే అత్యంత కఠినమైన ఈ చర్చల ప్రక్రియను మొత్తానికి సుఖాంతం చేయగలిగాన'ని ప్రస్తుత అధ్య క్షుడు జో బైడెన్ చెబుతున్నారు. ఈ ఘనత ఎవరి ఖాతాలో పడాలన్నది తేలకముందే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మొండికేస్తున్నారు. తొలుత ఒప్పందాన్ని స్వాగతించిన ఆయనే ఇంకా తేలాల్సినవి ఉన్నాయంటున్నారు. ఒప్పందంపై ఆమోదముద్ర వేసేందుకు నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాన్ని నిలిపివేశారు. ఈలోగా నిన్న, ఇవాళ గాజాపై ఇజ్రాయెల్ సాగించిన బాంబు దాడుల్లో 19మంది పిల్లలు సహా 80 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుందా లేదా, ఈ ప్రాంతంలో తాత్కాలికంగానైనా శాంతి నెలకొంటుందా అన్న అంశంలో సందిగ్ధత ఏర్పడింది. సుదీర్ఘకాలం ఘర్షణలతో అట్టుడికినచోట సాధారణ పరిస్థితులు ఏర్పడటం అంత సులభమేమీ కాదు. అందునా ఇజ్రాయెల్‌తో వైరమంటే మామూలుగా ఉండదు. ఇజ్రాయెల్ భూభాగంలోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి 2023 అక్టోబర్ 7న విచ్చలవిడిగా కాల్పులు జరిపి 1,200 మంది పౌరులను హతమార్చటంతో పాటు, 251 మందిని బందీలుగా తీసు కెళ్లటంతో ఇదంతా మొదలైంది. హమాస్ మతిమాలిన చర్య తర్వాత ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో గాజా, వెస్ట్‌బ్యాంక్‌లపై సాగించిన దాడుల పర్యవసానంగా ఇంతవరకూ కొందరు హమాస్ కీలకనేతలతో పాటు 46,700 మంది పౌరులు చనిపోయారు. ఇందులో అత్యధికులు పిల్లలు, మహి ళలే. ఇతరులు నిత్యం చావుబతుకుల మధ్య రోజులు వెళ్లదీస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం జారవిడిచే కరపత్రాలు సూచించిన విధంగా ఎటు పొమ్మంటే అటు వలసపోతూ అష్టకష్టాలు పడుతున్నారు. తిండీ, నీళ్లూ కరువై, అంతంతమాత్రం వైద్య సదుపాయాలతో జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఒక్కోటి 42 రోజులు (ఆరు వారాలు)ఉండే మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా అమలవుతుందా, మధ్యలో తలెత్తగల సమస్యలేమిటి అన్న ప్రశ్నలకు ఎవరి దగ్గరా సమాధానాల్లేవు. హమాస్ చెరలో ఇంకా 94 మంది బందీలు మిగిలారని, వారిలో 34మంది మరణించివుండొచ్చని ఇజ్రాయెల్ అంచనా. తొలి దశ అమల్లోవుండగా గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగాలి. ఆ తర్వాత పాలస్తీనా ఖైదీల విడుదలకు బదులుగా 33 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. ఒకసారంటూ ఒప్పందం అమలు మొదలైతే ఇరువైపులా ఉన్న బందీలను దశలవారీగా విడుదల చేస్తారు. గాజాకు భారీయెత్తున సాయం అందటం ప్రారంభమవుతుంది. ఒప్పందం ప్రకారం తొలి దశ కొనసాగుతున్న దశలోనే ఇజ్రాయెల్ రెండోదశ కోసం హమాస్‌తో చర్చించటం మొదలెట్టాలి. రెండో దశకల్లా బందీలతోపాటు దాడుల సందర్భంగా హమాస్‌కు చిక్కిన ఇజ్రాయెల్ ఆడ, మగ సైనికులు పూర్తిగా విడుదలవుతారన్నది అంచనా. అప్పుడు మొదలుకొని తొలి దశలో వున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణగా మారుతుంది. మూడో దశ అంతా పునర్నిర్మాణంపై కేంద్రీకరిస్తారు. హమాస్ బందీలుగా ఉంటూ మరణించినవారి మృత దేహాలు అప్పగించాలి. కేవలం మొదటి దశకు మాత్రమే ప్రస్తుత ఒప్పందం పరిమితమనీ... కొత్తగా చర్చలు జరిగాకే రెండు, మూడు దశలకు సంబంధించి తుది నిర్ణయం ఉంటుందని ఇప్పటికే నెతన్యాహూ ప్రకటించారు. తొలి దశ పూర్తయ్యాక మళ్లీ యుద్ధం తప్పదన్న హామీ ఇవ్వకపోతే తమ ఆరుగురు మంత్రులూ తప్పుకుంటారని తీవ్ర మితవాదపక్ష నాయకుడు, జాతీయ భద్రతా మంత్రి బెన్‌గివర్ హెచ్చరించటం తీసిపారేయదగ్గది కాదు. లెబనాన్‌లోని హిజ్బొల్లాతో ఉన్న రెండు నెలల కాల్పుల విరమణ ఒప్పందం ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. అక్కడ ఇరువైపులా కాల్పులు జరగని రోజంటూ లేదు. ఆ ఒప్పందం కూడా ఈనెల 26తో ముగుస్తుంది. ఇప్పుడు హమాస్‌తో కుదిరిన ఒప్పందం గతి కూడా అలాగే ఉంటుందా అన్నది ప్రశ్నార్థకం.సిరియాలో అసద్ నిష్క్రమణ, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నిమగ్నమైవుండటం, ఇరాన్ బల హీనపడటం, ట్రంప్ ఆగమనం వంటి పరిణామాలతో హమాస్‌లో పునరాలోచన మొదలయ్యాకే ఈ ఒప్పందానికి అంగీకరించింది. ఎనిమిదినెలల నాడు దాదాపు ఇవే షరతులు ప్రతిపాదిస్తే ఆ సంస్థ తిరస్కరించటం గమనార్హం. మొత్తానికి పశ్చిమాసియా తెరిపిన పడటానికి అన్ని పక్షాలూ చిత్తశుద్ధి ప్రదర్శించటం అవసరం. దాడులతో ఎవరినీ అణిచేయలేమని ఇన్నాళ్ల చేదు అనుభవాల తర్వాతైనా ఇజ్రాయెల్ గుర్తిస్తే మంచిది. ఎన్ని లోటుపాట్లున్నా ఘర్షణలు అంతరించాలి. శాంతి చిగురించాలి.

# నాగసాధువుగా మారడం ఎలా.. ఎంత కాలం పడుతుంది..




మహా కుంభమేళా అత్యంత వైభవంగా జరుగుతోంది. భారత్‌తో పాటు విదేశాల నుంచి వస్తున్న కోట్లాది మంది భక్తులతో ప్రయాగ్‌రాజ్ కిక్కిరిసిపోతోంది. అక్కడి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తూ పులకరిస్తున్నారు భక్తులు. హరిద్వార్, నాసిక్, ఉజ్జయినిల్లోనూ పుణ్యస్నానాల కోసం భక్తుల రద్దీ భారీగానే ఉంది. ఎప్పటిలాగే ఈసారి కూడా కుంభమేళాలో నాగసాధువులు, సన్యాసులు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ముఖ్యంగా నాగసాధువులు రకరకాల ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. రథాలు, ఒంటెలు, గుర్రాలు, ఏనుగులపై వస్తూ చేతుల్లో త్రిశూలాలు, వ్యాయామ ప్రదర్శనలు, కొన్నిసార్లు గన్‌లతో హోరెత్తిస్తున్నారు. నాగసాధువుల జీవనశైలి మీద చాలా మందికి ఎనలేని ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో అసలు నాగసాధువుగా మారడం ఎలా? ఇలా మారడానికి ఎంత కాలం పడుతుంది? తదిరత వివరాలు ఇప్పుడు చూద్దాం..

నాగసాధువుగా మారడం ఎలా?

నాగసాధువులు అనగానే అఖాడా అనే పదం బాగా వినిపిస్తుంది. మామూలుగా అఖాడా అంటే రెజ్లింగ్‌కు సంబంధించినదిగా భావిస్తారు. కానీ కుంభమేళాలో మాత్రం ఇది సాధువులు, సంత్‌లు, సన్యాసుల సంప్రదాయంతో ముడిపడినదిగా చెప్పొచ్చు. కుంభమేళా టైమ్‌లోనే అఖాడాల్లోకి కొత్త సన్యాసులను చేర్చుకుంటారు. మొత్తం 15 రకాల అఖాడాలు ఉన్నాయి. వీటిల్లో ఒకదానిలో చేరడం ద్వారా సన్యాసులు భౌతిక ప్రపంచాన్ని జయించినట్లుగా భావిస్తారు. అయితే దీనికి ముందు వాళ్లు కొన్ని పరీక్షలను అధిగమించాలి.

అవన్నీ వదిలేయాలి!

ప్రతి అఖాడాకు ఒక కల్చర్ ఉంటుంది. శివుడు, విష్ణువును నమ్మే అఖాడాలతో పాటు ఉదాసి, సిక్కు అఖాడాలు కూడా ఉన్నాయి. వీటిల్లో సుమారు 5 లక్షల మంది సాధువులు ఉన్నారని అంచనా. సన్యాసం స్వీకరించే సమయంలో ఆ వ్యక్తి ఏ వర్గం వారో ఆ వర్గం పేరుతో పాటు కొత్తపేరును జత చేస్తారు. సన్యాసిగా మారాక కుటంబ బాంధవ్యాలను త్యజించాలి. వాళ్ల పేరుకు ఆఖరున గురువు పేరును జత చేస్తారు. నాగసాధువుగా మారాలంటే తొలుత ఓ నాగసాధువు వద్ద శిష్యరికం చేయాలి. శారీరకంగా వారిలో ఎలాంటి లోపం ఉండకూడదు. 16 నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువకులు ఈ దీక్షను మొదలుపెట్టొచ్చు. దీక్ష స్టార్ట్ చేసే టైమ్‌లో వాళ్ల జుట్టును కత్తిరిస్తారు. మహా పురుష్ లేదా వస్త్రధారి అనే పేరును వాళ్లకు పెడతారు.

నాగదిగంబరులుగా మారితే..!

నాగసాధువుగా మారే వ్యక్తి సీనియర్ నాగసాధువు దగ్గర శిక్షణ తీసుకోవాలి. వ్యక్తిగతంగా గురువు ఉండరు. కానీ ప్రతి అఖాడాకు ఓ దైవం ఉంటారు. ఆ ప్రధాన దైవమే వారికి అసలైన గురువుగా చెబుతారు. శుభ్రపరచడం, వంట చేయడం, నాగఫణి వాయించడంతో పాటు అస్త్రాల వాడుకలో నైపుణ్యత సాధించడం లాంటివి నేర్చుకోవాలి. వాళ్ల దీక్ష, పట్టుదల చూసి సంతృప్తి చెందితే వారిని నాగదిగంబరులుగా దీక్ష చేయిస్తారు సీనియర్ నాగసాధువులు. ఆ సమయంలో అఖాడాలకు చెందిన మహంత్ వారితో ప్రమాణం చేయిస్తారు. ఒక్కసారి నాగదిగంబరులుగా మారితే ఇక ఇంటికి తిరిగి వెళ్లలేరు.

ఈ నిబంధనలూ పాటించాల్సిందే!

నాగసాధువుగా మారేందుకు మరికొన్ని నిబంధనలు కూడా ఉన్నాయి. కుంభమేళా సమయంలో మూడ్రోజుల పాటు ఉపవాస దీక్ష చేస్తూ మంత్రాలు జపించాలి. అలాగే సొంతంగా శ్రాద్ధ కర్మలు నిర్వహించాలి. 21 తరాల వారికి పిండదానం చేయాలి. అనంతరం లౌకిక ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవాలి. స్వీయ గుర్తింపును తొలగించుకోవాలి. అలాగే జుట్టు కత్తిరించుకోవాలి. కుంభమేళా జరిగే ప్రాంతంలో పొద్దునే పవిత్ర స్నానం చేయాలి. దీంతో సాధువుగా తాము పునర్జన్మ పొందామని వాళ్లు భావిస్తారు. అయితే సన్యాసి దశ నుంచి నాగసాధువుగా మారే ప్రక్రియ ఒక్కరోజులో జరిగేది కాదు. దీనికి కనీసం 2 నుంచి 12 ఏళ్ల టైమ్ పడుతుంది. నిర్దిష్టమైన కాల పరిమితి కూడా లేదు.

# మద్రాస్ హైకోర్టు తీర్పు హిందూత్వ మనువాదులకు చెంపపెట్టు!



మద్రాస్ :ఉన్నది ఉన్నట్లు చెప్పినా తమ మనోభావాలను దెబ్బ తీశారంటూ దెబ్బలాటలకు దిగుతున్న పరిస్థితి. తరతరాలుగా జరుగుతున్నదే. భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని నాటి క్రైస్తవ మతగ్రంథాలు, జ్యోతిష గ్రంథాలు చెప్పినది వాస్తవం కాదని సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నదని నిరూపించిన ఖగోళ శాస్త్రజ్ఞుడు నికోలస్ కోపర్నికస్‌పై ఐదు వందల సంవత్సరాల క్రితమే నాటి క్రైస్తవ మతవాదులు దాడి చేశారు, మూరు?డని నిందించారు. చరిత్రలో ఏ మతవాదీ నిజాన్ని అంగీకరించిన దాఖలా లేదు. మన దేశంలో హిందూత్వ, ఇస్లామిక్, క్రైస్తవ మతవాదులు దానికి అతీతులు కాదు. అలాంటి వారికి 2025 జనవరి మొదటి వారంలో మద్రాస్ హైకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చింది.తమిళనాడులో విడుతలై చిరుతాయిగల్ కచ్చి (విసికె) అనే పార్టీ ఎంపీ తిరుమావళవన్. అతని మీద 2020లో ఒక ప్రైవేటు కేసు నమోదైంది. అదేమిటంటే పెరియార్ అనే యూట్యూబ్ ఛానల్‌లో ఫిర్యాదుదారు ఒక కార్యక్రమాన్ని చూశారు. తిరుమావళవన్ మరొక వ్యక్తితో కలసి హిందూ మహిళల గురించి బహిరంగంగా చెప్పిన మాటలు వారి స్థాయిని దిగజార్చేవిగా ఉన్నాయని, వారి గురించి ఒక తప్పుడు కథనాన్ని చెప్పారని, వాటిని విని ఒక హిందువుగా అవమానకరంగా భావించానని, తన మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నందున తగిన చర్యలు తీసుకొని శిక్షించాలన్నది కేసు సారం. ఆ కేసులో పసలేదని దాన్ని కొట్టివేయాలంటూ తిరుమావళవన్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దాని మీద విచారణ జరిపిన న్యాయమూర్తి పి.వేలుమురుగన్ కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కరోనా సమయంలో 'పెరియార్–భారత రాజకీయాలు' అనే అంశంపై యూరోపియన్ పెరియార్ అంబేద్కర్ కామ్రేడ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో తిరుమావళవన్ ప్రసంగించారు. దానిలో మనుస్మృతిలో ఉన్న కొన్ని అంశాలను ప్రస్తావించారు. అవి తమ మనోభావాలను దెబ్బ తీశాయన్నది కేసు. అయితే తిరుమావళవన్ మనుస్మృతిలో ఉన్న అంశాలను ప్రస్తావించి వాటికి అర్థం చెప్పారు. తానుగా కొత్తగా చెప్పిందేమీ లేనందున ఎలాంటి చర్య తీసుకోనవసరం లేదంటూ న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. తిరోగామి భావజాలం గురించి గతంలోనే అనేక మంది చీల్చి చెండాడారు. వాటిని పునశ్చరణ చేయవచ్చు, మరింతగా వివరించవచ్చు. అంతే కాదు ఈ తీర్పుతో ఒకటి స్పష్టమైంది. ఎవరినీ కొట్టావద్దు తిట్టావద్దు, పురాతన సంస్కృత గ్రంథాల్లో ఉన్న వాటి అసలు అర్థాలను చెబుతూ వాటిని జనంలోకి మరింతగా తీసుకువెళితే చాలు. ముంజేతిని చూసుకొనేందుకు అద్దాలు అవసరం లేదు.ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టులో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని 2020 నవంబరులో జస్టిస్ ఎం సత్యనారాయణన్, జస్టిస్ ఆర్ హేమలత డివిజన్ బెంచి కొట్టివేసింది. ఎస్ కాశీరామలింగం దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో బిజెపి నేత, న్యాయవాది ఆర్‌సి పాల్ కనకరాజ్ వాదించారు. ఉనికిలో లేని మనుస్మృతిని నిషేధించాలని పార్లమెంటు సభ్యుడు కోరుతూ చేసిన ప్రసంగం అశాంతికి, వివిధ తరగతులను రెచ్చగొట్టటానికి దోహదం చేసినందున సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని కోర్టును కోరారు. ప్రసంగం చేయటమే గాక దాన్ని నిషేధించాలని కూడా డిమాండ్ చేశారన్నారు. మనుస్మృతి రాజ్యాంగ బద్ధమైనదేమీ కాదని, అందువలన దాన్ని ఫలాన విధంగానే చదవాలనే నిబంధనేమీ లేదని, రెండు వేల సంవత్సరాల నాటి గ్రంథానికి భాష్యాలు చెప్పవచ్చని అందువలన ఎంపీపై చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని కోర్టు తీర్పు చెప్పింది. దానిలో చెప్పిన నైతిక నియమావళి రాజ్యాంగబద్ధం కాదని, వాటిని అమలు జరపలేమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వాద ప్రతివాదనల సందర్భంగా తమ పిటీషన్‌ను ఉపసంహ రించుకొని రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అంశాలతో మరొక పిటీషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని న్యాయవాది పాల్ కనకరాజ్ కోర్టును కోరారు. చివరికి పిల్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ అంశం మీదే జిల్లా కోర్టులో ఒక ప్రైవేట్ కేసును దాఖలు చేశారు.దాన్ని ఈ నెలలో హైకోర్టు కొట్టివేసింది.మద్రాస్ హైకోర్టు తీర్పు మరో ఉదంతాన్ని గుర్తుకు తెచ్చింది. కర్ణాటకలో మైసూరు విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్, ప్రముఖ రచయిత, హేతువాది కెఎస్. భగవాన్. రామాయణం ఉత్తరకాండలో ఉన్న వాటిని గురించి చెప్పినందుకు హిందూత్వవాదులు అంతుచూస్తామని బెదిరించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన ఈ అంశాలను చెబుతున్నారు. ఉత్తరకాండలో ఉన్నదాని ప్రకారం రాముడు పదకొండువేల సంవత్సరాలు పాలించలేదని, పదకొండు ఏళ్లు మాత్రమే రాజుగా ఉన్నట్లు, అడవుల్లో తాను మద్యం తాగుతూ సీతాదేవిని కూడా తాగమని కోరినట్లు, కొందరు రామరాజ్యం తెస్తామని చెబుతున్నారని, రాముడు ఆదర్శప్రాయుడేమీ కాదని భగవాన్ చెప్పిన అంశాలు తమ మనోభావాలను గాయపరచినట్లు కొందరు ప్రైవేటు కేసును దాఖలు చేశారు. సీతాదేవిని అడవుల పాల్జేసి పట్టించుకోని, శూద్రుడైన శంబుకుణ్ని వధించిన రాముడిని ఎలా సమర్ధిస్తారని భగవాన్ ప్రశ్నించారు. "ప్రొఫెసర్ కల్‌బుర్గి, గోవింద్ పన్సారే, నరేంద్ర దబోల్కర్‌లను హత్య చేసినవారు ఇప్పుడు నన్ను కూడా చంపుతామని బెదిరిస్తున్నారు. వారికి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. మీరు మా మీద దాడి చేయవచ్చు, ముక్కలుగా నరకవచ్చు కానీ మా రచనలు సజీవంగానే ఉంటాయి. వారు నన్ను చంపవచ్చు తప్ప. నా వైఖరిని మార్చలేరు" అని భగవాన్ స్పష్టం చేశారు. ఈ వివాదం తరువాత కొంత మంది అసలు ఉత్తరకాండను వాల్మీకి రాయలేదని, తరువాత కొందరు దాన్ని చేర్చారని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రామాయణాలు అనేకం ఉన్నాయి. దేన్ని సాధికారికంగా తీసుకోవాలో చెప్పినవారెవరూ లేదు. ఎవరికీ అలాంటి సాధికారత లేదు. ఎవరైనా పుచ్చుకుంటే దానితో అంగీకరించాలని కూడా లేదు.మనుస్మృతిలో రాసినవి, వాటి ఆచరణ చూసి తన మనోభావాలు తీవ్రంగా గాయపడిన కారణంగానే బాబాసాహెబ్ అంబేద్కర్ వంద సంవత్సరాల క్రితమే దాన్ని తగులబెట్టి నిరసన వెల్లడించారు. సదరు మనువాదాన్ని మరింతగా ముందుకు తీసుకుపోవాలని, అది లేకుండా రచించిన రాజ్యాంగాన్ని విమర్శిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక సంపాదకీయాలు రాసింది. రాజ్యాంగ నిర్మాతలు పక్కన పెట్టిన మనుస్మృతిని తమ న్యాయశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. కోర్టులలో అమలు చేసే శిక్షాస్మృతులను పాఠాలుగా చెప్పాలి, శిక్షణ ఇవ్వాలి తప్ప ఇలాంటి చర్యలతో అధికారికంగా మనువాదులను తయారు చేసే వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఇలాంటి బలవంతాలు చేసే శక్తులు ఒక వైపు రెచ్చిపోతుంటే మరోవైపు దాన్ని వ్యతిరేకించేవారు కూడా ఎప్పటికప్పుడు తయారవుతారు. నూతన ఆర్థిక విధానాల పేరుతో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంస్కరణలు దేశంలో ఆర్థిక అసమానతలను మరింతగా పెంచి, కార్పొరేట్ జలగలకు జనాలను అప్పచెప్పాయి. వాటిని మరింత వేగంగా అమలు జరుపుతున్న బిజెపి నూతన విద్యావిధానం పేరుతో తన కాషాయ ఎజెండాను దేశం మీద రుద్దేందుకు పూనుకుంది. దానిలో భాగమే సిలబస్‌లో మనువాదాన్ని చేర్చటం. మరింతగా మనువాదులను న్యాయ వ్యవస్థలో చేర్చేందుకు వేసిన పథకమిది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు విద్య, సమాన హక్కులు, సాధికారతను పూర్తిగా వ్యతిరేకించే తిరోగమన భావాలను బలవంతంగా అధ్యయనం చేయించేందుకు చూస్తున్నారు. అంతేకాదు, శూద్రులు, దళితులుగా ఉన్న 85 శాతం మంది గురించి కూడా దాన్నిండా వ్యతిరేకతలే, మొత్తంగా మన రాజ్యాంగానికి, దానికి స్ఫూర్తికి వ్యతిరేకమైనది.ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భగత్ సింగ్ స్టూడెంట్స్ మోర్చా (బిఎస్‌ఎం)కు చెందిన వారు డిసెంబరు 25న మనుస్మృతి గ్రంథంపై ఒక చర్చ నిర్వహించారు. తరువాత తగుల బెట్టేందుకు నిర్ణయించారు. ఆ సందర్భంగా ముగ్గురు విద్యార్థినులతో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసి కేసు పెట్టారు. పదిహేడు రోజుల తరువాత వారు బెయిలు మీద జనవరి 11న విడుదలయ్యారు. ఈ విశ్వవిద్యాలయంలో మనుస్మృతిపై పరిశోధన చేసే వారికి ఫెలోషిప్ ఇస్తున్నారు. దాని గురించి చర్చించేవారిని తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మన నేతన్నలను దెబ్బతీసిన విదేశీ వస్త్రదహనం ఒక పోరాట రూపంగా ఉన్న సంగతి తెలిసిందే. అదే విధంగా దిష్టిబొమ్మల దహనం కూడా. సమాజంలో స్త్రీలు, మెజారిటీ కులాల వారిపట్ల వివక్ష, దురాచారాలను ప్రోత్సహించే మనుస్మృతికి వ్యతిరేకంగా ఒక నిరసన రూపంగా దాని దహనాన్ని అంబేద్కర్ ఎంచుకున్నారు. తొలిసారిగా 1927లో స్వయంగా ఆపని చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబరు 25ను మనుస్మృతి దహన దినంగా పాటిస్తున్నారు. ఎక్కడో అక్కడ అది కొనసాగుతూనే ఉంది. బెనారస్ విశ్వవిద్యాలయ విద్యార్థులు హింసాకాండకు, దాడులకు పాల్పడ్డారంటూ తప్పుడు కేసులు పెట్టారు. కస్టడీలో పోలీసులు వారిని కొట్టారు, దుస్తులు చించివేశారు, బెదిరించారు. పదేళ్ల వరకు శిక్షలు పడే సెక్షన్లతో నేరాలను మోపారు. ఉగ్రవాద వ్యతిరేక దళ పోలీసులు వారిని విచారించటాన్ని బట్టి ఎలాంటి నేరాలు మోపారో, ఉత్తర ప్రదేశ్‌లో ఎలాంటి రాజ్యం నడుస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

# ప్రతి మహిళకు వ్యక్తిగత రుణాలకు అవకాశం

హైదరాబాద్,రాష్ట్రంలోని ప్రతి పేదింటి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు పేదవర్గాలకు చెందినవారైతే చాలు. తెల్లకార్డు తప్పనిసరిగా ఉండి తీరాలి. దీంతో పాటుగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండాలి. ఈ పథకానికి అర్హులై ఉండి కూడా డ్రాక్రా గ్రూపుల్లో లేమని సిటీలు, పట్టణాల్లోని మహిళలు చింతించాల్సిన అవసరం లేదు. అలాంటి వారి కోసం ప్రభుత్వమే తగిన ఏర్పాట్లు చేసింది. కొత్తగా డ్వాక్రా గ్రూపుల్లో సభ్యత్వం పొందడానికి, స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ – సహకరిస్తుంది. అర్హురాలైన ప్రతి మహిళలకూ సభ్యత్వం కల్పించి పథక ప్రయోజనాలు అందేలా చూస్తుంది. కొత్తగా డ్వాక్రా సంఘాల్లో చేరాలని ఆశించే మహిళలు ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదు. మెప్మా ప్రతినిధులే మీ ఇంటికి వచ్చి ఆ అవకాశం కల్పిస్తారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్‌ని ప్రారంభించింది ప్రభుత్వం. జనవరి చివరి వరకూ చేపట్టే ఈ డ్రైవ్‌లో భాగంగా మెప్మా ఉద్యోగులు, సిబ్బందీ ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సర్వే నిర్వహిస్తారు. డ్వాక్రా గ్రూపుల్లో లేని మహిళల వివరాలు సేకరించి నెలాఖరు కంతా ఆ డేటా మొత్తం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆసక్తి ఉండి అర్హులైతే చాలు. మెప్మా సభ్యులే వారిని స్వయం సహాయక సంఘాల్లో చేర్చుతారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మెప్మానే అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించి రుణాలు ఇప్పిస్తుంది. గడువులోగా పని చేయాలని తెలంగాణ ప్రభుత్వం రూల్ పెట్టడంతో వీలైనంత త్వరగా ఈ పని పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తోంది మెప్మా. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా.. కొత్తగా డ్వాక్రా గ్రూపులో సభ్యత్వం పొందిన ప్రతి మహిళకు రూ.3.50 లక్షల వ్యక్తిగత రుణం ఇస్తారు. గరిష్ఠ రుణ పరిమితి రూ.15లక్షల వరకూ ఉంటుంది. మెప్మా స్వయం సహాయక సంఘాలకు లభించే అన్ని ప్రయోజనాలూ వీరికి లభిస్తాయి. ఈ పథకం పొందినవారు ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా పరిహారం దక్కుతుంది. సాధారణ మరణం అయితే రూ.2 లక్షల బీమా పరిహారం ఇస్తారు. తెల్లరేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. మెప్మా ద్వారా డ్వాక్రా సంఘాల్లో చేరి ఉండాలి. ఇందిరా మహిళాశక్తి పథకం కింద రుణం తీసుకునే మహిళ.. ఏదైనా వ్యాపారం మొదలుపెట్టవచ్చు. పెద్ద వ్యాపారం చెయ్యాలనే ఆలోచన ఉన్నవారు మెప్మా ఉద్యోగుల సహాయంతో భారీ మొత్తంలో రుణాలు పొందవచ్చు. మరిన్ని వివరాలకు మెప్మా టోల్ ఫ్రీ నంబర్ 040 1234 1234కి కాల్ చేయవచ్చు.

# లాంగ్ టర్మ్ వ్యూహం ఉందా?

అమరావతి,ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమిగానే రంగంలోకి దిగుతాం. మొన్న గెలిచామని లైట్ తీసుకోవడం లేదు.. ఇంకో పదిహేనేళ్లు టీడీపీతోనే దోస్తీ అంటున్నారు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్. కలిసి కదం తొక్కి మొన్నే సత్తా చాటాం..రాబోయే రోజుల్లోనూ కలిసే నడుస్తాం..నవ్యాంధ్రను ఒక్కో మెట్టుపైకి ఎక్కిస్తామంటూ..కూటమి ఫ్యూచర్‌పై అటు సీఎం చంద్రబాబు, ఇటు డిప్యూటీ సీఎం పవన్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు.మరో పదిహేనేళ్లు కలిసే ఉండాలని భావిస్తున్నాం. రెండు రోజుల నుంచి డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలివి. గతంలోనూ కూటమిగానే ముందుకెళ్తామని చెప్పారు పవన్. ఇప్పుడు మరింత గట్టిగా తన వాదనను వినిపిస్తున్నారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతల మధ్య అక్కడక్కడ విభేదాలు వచ్చాయి. నియోజకవర్గాల్లో మూడు పార్టీల లీడర్లకు కోఆర్డినేషన్ మిస్ అవడంతో పాటు వైసీపీ నుంచి వచ్చే నేతల చేరికల విషయం లోనూ కాస్త గ్యాప్ ఏర్పడింది.

కుండ బద్దలుకొట్టి చెబుతున్న పవన్

అనంతపురంలో బీజేపీ వర్సెస్ టీడీపీ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో టీడీపీ వర్సెస్ జనసేన.. ఇలా పలు జిల్లాల్లో కూటమి నేతల మధ్య గొడవలు రాజకీయంగా ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇలాంటి సందర్భాల్లో పొత్తు ఉంటుందని కుండ బద్దలుకొట్టి చెప్తున్నారు పవన్. అయితే నియోజకవర్గాల్లో మూడు పార్టీల నేతల సఖ్యత కుదరకపోవడంతో పొత్తు కష్టమేనన్న వాదనలు వినిపించాయి. అయినా ఎక్కడా కూడా గాడి తప్పకుండా పొత్తు రథం పదిలంగా ముందుకు సాగింది.అయితే పొత్తు విషయంలో బాబు కంటే ముందే పవన్ క్లారిటీతో ఉన్నారు. పలుమార్లు సేనాని ఓపెన్‌గానే స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. ఇంకో పదేళ్లు చంద్రబాబే సీఎంగా ఉండాలని ఆ మధ్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు పవన్. బాబు దూరదృష్టితో ఏపీ మరింత డెవలప్ అవుతుందని చెప్పుకొచ్చారు.

ఆ తర్వాత కూటమి ఫ్యూచర్‌పై హస్తిన వేదికగా సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. జమిలి ఎన్నికలు వచ్చినా..2029లో ఎలక్షన్స్ జరిగినా కలిసే పోటీ చేస్తాం.. ఇప్పటి నుంచే ఎన్నికలకు రెడీ అవతున్నామంటూ బాబు చెప్పడం హాట్ టాపిక్ అయింది. అధికారంలోకి వచ్చాం..అవసరమైపోయిందని కాకుండా..కలసి నడిస్తే పార్టీలకు, ప్రజలకు జరిగే మేలేంటి తెలిసిన నాయకులుగా అటు చంద్రబాబు, ఇటు పవన్ బిహేవ్ చేస్తున్నారు.ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాయి. ఇందులో ఒక్క టీడీపీకి మాత్రమే గెలుపును సొంతం చేసుకునేంత ఓటు బ్యాంకు ఉంది. జనసేనకు పవన్ ఇమేజ్, క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ సొంతంగా గెలిచేంత బలం లేదు. అలా అని కీలకం కాదని చెప్పలేం.ఏపీలో గెలుపోటములను డిసైడ్ చేసేంత సత్తా మాత్రం జనసేకు ఉంది. ఇక బీజేపీ అయితే కూటమితోనే అన్నో ఇన్నో సీట్లు సంపాదిస్తూ వస్తోంది. సో ఈ నేపథ్యంలో అధికారంలో ఉండాలని కోరుకునే ఈ మూడు పార్టీలు..కలిసి పోటీ చేస్తేనే పవర్ స్టీరింగ్‌ను పట్టుకోగలవన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.పొత్తుపై ముందే అలర్ట్ అవడం వెనుక ఇంకో స్ట్రాటజీ ఉందట. ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా అంతో ఇంతో ప్రజావ్యతిరేకత కామన్. డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండే ఆ ఓటు షేర్ మీదే గెలుపోటములు డిపెండ్ అయి ఉంటాయ్. అందుకే ఎవరిదారి వారిదే అని కాకుండా..లాంగ్ లివ్ కూటమి అంటున్నారు బాబు, పవన్.రాష్ట్రంలో జనసేన, బీజేపీ కంటే టీడీపీ ఓటు బ్యాంకే ఎక్కువ. ఆ పార్టీనే బూత్ స్థాయి వరకు చాలా స్ట్రాంగ్‌గా ఉంది. ఆ తర్వాత ప్రతీ ఊర్లో పవన్‌కు అభిమానులు ఉంటారు. అంత పటిష్టంగా ఉండి కూటమిని లీడ్ చేస్తున్న టీడీపీ, జనసేన అధినేతలే పొత్తు ఉంటుందని పదేపదే చెప్పడం వెనుక పెద్ద ప్లానే ఉన్నట్లు కనిపిస్తోంది.

పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉంటాయా?

రాజకీయాలు అన్నప్పుడు పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మొన్నటి ఎన్నికల్లో లభించినంత ప్రజా మద్దతు ఎప్పటికీ ఉండకపోవచ్చు. అలాంటప్పుడు కూటమిగా పోటీ చేస్తే..గత ఎన్నికల్లో వచ్చినంత ల్యాండ్ స్లైడ్ విక్టరీ కాకపోయిన..ప్రభుత్వ ఏర్పాటుకు మాత్రం ఇబ్బంది ఉండదనేది బాబు, పవన్ ప్లాన్‌గా తెలుస్తోంది. సేమ్‌టైమ్ కూటమిగా గెలిచారు..ఎన్నాళ్లు కలిసి ఉంటారు.? మిత్రబంధం ఎప్పటిదాకా.? అన్న ప్రశ్నలకు కూడా తమ కామెంట్స్‌తో క్లారిటీ ఇచ్చేస్తున్నారు టీడీపీ, జనసేన అధినేతలు. పొత్తు ఉంటుంది.. క్షేత్రస్థాయిలో టీడీపీ–బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు కలిసి నడవాల్సిందేనని ఇండికేషన్ ఇస్తున్నారు.మరో 15 ఏళ్లు పొత్తు ఉంటుందని అని పవన్ అంటున్నారు.

# అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో నిందితుడి గుర్తింపు

హైదరాబాద్,హైదరాబాద్‌లో కాల్పులకు తెగబడ్డ నిందితుడిని మనీశ్‌గా గుర్తించారు. ఇతడు బీహార్ రాష్ట్రానికి చెందిన వాడుగా పోలీసులు తెలిపారు. మనీష్‌తో బీహార్ రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు జతకట్టాడు. వారం రోజుల క్రితం నిందితుల చోరీలు మొదలు పెట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో వారం రోజుల క్రితం ఏటీఎం సిబ్బందిని బెదిరించి రూ. 70 లక్షల రూపాయలు మనీష్ అండ్ కో కాజేశారు. అనంతరం గురువారం (జనవరి 16) బీదర్‌లో ఏటీఎం సెక్యూరిటీ గార్డ్‌ను హత్య చేసి రూ.93 లక్షలు మనీశ్ ఎత్తుకెళ్లాడు. బీదర్ నుంచి హైదరాబాద్ వచ్చిన మనీశ్.. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపాడు. ఇప్పటికే మనీశ్‌పై బీహార్ ప్రభుత్వం రివార్డ్ ప్రకటించింది. గతంలోనూ మనీష్‌పై మర్డర్, దోపిడీ కేసులు ఉన్నాయి. గతంలో కేసులు నమోదైనప్పుడు మనీష్ బార్డర్ దాటి నేపాల్ పారిపోయాడు. కేసుల తీవ్రత తగ్గాక ఇండియాకు వచ్చి మళ్లీ దోపిడీలకు పాల్పడుతున్నాడు మనీశ్. మనీశ్‌ను పట్టుకునేందుకు నాలుగు రాష్ట్రాల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ, బీహార్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో మనీశ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ వెళ్లిన నిందితులు అక్కడ బట్టలు, బ్యాగులు కొనుగోలు చేశారు. తిరుమలగిరి వద్ద ఓ నిర్మానుష్య ప్రదేశంలో బట్టలు, బ్యాగులు మార్చుకున్నారు. తిరుమలగిరిలో బ్యాగులను నిందితులు వదిలేశారు. ట్రాలీ బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. సుచిత్ర వైపు నిందితులు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ట్రాలీబ్యాగులను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. దాదాపు పది బృందాలు ఏర్పడి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఖచ్చితంగా కేసును ఛేదిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## దీపా దాస్‌పై వేటు ఖాయమా?

హైదరాబాద్,కింది మీద పడి పదేళ్ల తర్వాత పార్టీ పవర్‌లోకి వచ్చింది. వన్ ఈయర్ పాలన కూడా కంప్లీట్ అయింది. అయినా పార్టీ పరంగా ఏదో లోటు ఉందని భావిస్తోందట హస్తం పార్టీ హైకమాండ్. పార్టీలో ప్రక్షాళన చేయాలని ఫిక్స్ అయ్యారట. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ నుంచే మార్పులు, చేర్పులు మొదలు పెడుతారని చర్చ జరుగుతోంది. త్వరలోనే టీపీసీసీ పూర్తిస్థాయి కార్యవర్గ ఏర్పాటు చేస్తారట. అంత కంటే ముందే ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్ మున్షిని తప్పిస్తారన్న టాక్ వినిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌ను మార్చడం ఖాయమేనా? కార్యవర్గంలోకి ఎవరెవరిని తీసుకుంటారు.?తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చి ఏడాది అయిపోయింది. పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టి కూడా 4 నెలలు దాటిపోయింది. అయినా ఇప్పటివరకు పీసీసీ కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. గతంలో పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు నియమించిన పాత కార్యవర్గమే కొనసాగుతూ వస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రయత్నించినప్పటికీ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదట. దీంతో పార్టీ పదవుల పై ఆశలు పెట్టుకున్న ఆశావహులంతా ఇంకెప్పుడు ఢిల్లీ పెద్దల నుంచి అనుమతి లభిస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారట.

హైకమాండ్ నిర్ణయం తీసుకుందా?

ఇటీవల ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తర్వాత దేశవ్యాప్తంగా పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నిర్ణయించిందట హైకమాండ్. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై దృష్టిపెట్టిన అధిష్టానం పెద్దలు..ముందుగా చాలా రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇంచార్జ్‌లు, ప్రధాన కార్యదర్శులను మార్చాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా త్వరలోనే భారీ మార్పులు, చేర్పులు ఉంటాయనే సంకేతాలు ఇచ్చారట. అయితే పీసీసీ ప్రక్షాళన కంటే ముందు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షీని మార్చాలని అధిష్టానం భావిస్తున్నట్లు టాక్.దీపా దాస్ మున్షీని తప్పించాలని ఢిల్లీ పెద్దలు నిర్ణయించడానికి చాలా కారణాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చాలామంది తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్‌మున్షీ వైఖరిపై అసంతృప్తితో ఉన్నారట. అధికార పార్టీకి ఇంచార్జ్‌గా ఉన్న దీపా దాస్ మున్షి వ్యవహరించే తీరు ఇది కాదన్నది మెజార్టీ నేతల అభిప్రాయంగా తెలుస్తోంది.పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేయడంలో ఆమె ఫెయిల్ అయ్యారని భావిస్తున్నారట నేతలు. ఎన్నికల సమయంలో కొంతమందికి పట్టుబట్టి టికెట్లు ఇప్పించారని, ఇప్పుడు కూడా మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తనకు నచ్చిన కొన్ని పేర్లను తెర మీదకి తెస్తున్నారంటూ సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి లాంటి వారు ఈ విషయాన్ని బహిరంగంగానే చెప్పేయడం పార్టీలో చర్చనీయాంశమైంది.

దీపా దాస్ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారా?

పార్టీలో సీనియర్లను ఏ మాత్రం పట్టించుకోకుండా..దీపా దాస్ మున్షి తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సహా, మంత్రులు, ప్రభుత్వంలో కీలకంగా ఉన్నవారితో దీపాదాస్‌కు ఏ మాత్రం కోఆర్డినేషన్ లేదని అంటున్నారు. అందుకే ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం లోపించిందని నేతలు వాపోతున్నారు. ఈ విషయాలన్నీ నేతలు వరుసగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో ఢిల్లీ పెద్దలు కూడా దీపాదాస్ తీరుపై నివేదిక తెప్పించుకున్నారని తెలుస్తోంది.అందులో భాగంగానే మొన్న గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రత్యేకంగా హాజరయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీని తప్పించి..తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రక్షాళన మొదలుపెడుతామని ఢిల్లీ నుంచి సంకేతాలు వస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో త్వరలోనే పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తారని..ఆశల పల్లకిలో ఉన్నారు ఆశావహులు. అయితే దీపాదాస్ మున్షిని తప్పిస్తారా ఒకవేళ తప్పిస్తే ఇంచార్జ్‌గా రాబోయే నేత ఎవరనేది ఆసక్తిరేపుతోంది.

## తిరుమలలో అపచారాలకు ఎవరిది బాధ్యత

తిరుపతి, తిరుమల విషయంలో గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి టిటిడికి అండగా ఉండగా జరుగుతున్నది ఏంటని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. శనివారం కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో విజిలెన్స్ నిఘా పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. చంద్రబాబు పాలనలో మద్యం, మాంసం తిరుమలలో పట్టుబడుతున్నాయని ఆరోపించారు. శ్రీవారి ఆలయానికి సమీపంలో గుడ్డు బిర్యాని పట్టుబడింది అంటే టిటిడి వైఫల్యం మరోసారి బట్టదాఖలైందని ధ్వజమెత్తారు. మారణాయుధాలతో వచ్చినా పట్టించుకోలేని పరిస్థితికి తీసుకువచ్చారని అన్నారు. ఎల్లో మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాలు చేశారని ఆరోపించారు. టిడిపి నాయకుల సేవలో టిటిడి చైర్మన్ పనిచేస్తున్నారనీ, భక్తులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరుమల కొండపై ఎర్ర చందనాన్ని స్మగ్లింగ్ చేస్తూ 4 సార్లు పట్టుబడ్డారని అన్నారు.

# మంచుగడ్డలా కరిగిపోతున్న విపక్షాల ఐక్యత !

న్యూఢిల్లీ,విపక్షాలు ఉమ్మడిగా ప్రజల సమస్యలపై పోరాడడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పార్లమెంట్ గత శీతాకా సమావేశాల్లో అర్థం లేని చర్చతో అర్థాంతరంగా ముగించేలా చేశారు. రేపటి బడ్జెట్ సమావేశాలు కూడా ఇంతకన్నా గొప్పగా ఉంటాయనుకోవడం భ్రమే. ఎందుకంటే విపక్షాలు ఒక ఎజెండాతో పోతున్నాయి. అధికారపక్షం మరో ఎజెండాతో వస్తోంది. ఈ క్రమంలో అసలు ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ అధికార పక్షం వాటిని పక్కకు పోయేలా చేస్తోంది. చర్చకు రాకుండా చేస్తోంది. ఈ క్రమంలో అధికార పక్షాన్ని నిలదీసే శక్తియుక్తులు విపక్షాల్లో కనిపించడం లేదు. కేవలం రచ్చ చేయడం, వాకౌట్ చేయడం, పార్లమెంట్ ముందు ధర్నా చేయడమే తమ పోరాటంగా మలచు కుంటున్నారు. అందరి లక్ష్యం అధికారమే తప్ప..దేశం, ప్రజలు అన్న ఎజెండా కనిపించడం లేదు. బహుశా ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి భారతదేశంలో మునుపెన్నడూ లేదు. ప్రజలను పట్టించుకోని పాలకులు, ప్రతిపక్షాలను చూస్తున్నాం. ప్రతిపక్షమంటే విమర్శలు చేయడం, పాలకపక్షం అంటే అధికారాన్ని తనివితీరా అనుభవించడం అన్నది రూఢి చేసుకున్నారు. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్‌తో విపక్షాలను ఐక్యం చేసినా అది బలంగా ముందుకు సాగలేక పోతోంది. గత పదేళ్లుగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తీరు చూస్తుంటే ఇది అర్థం చేసుకోవచ్చు. ప్రధాన సమస్యవేవీ చర్చించవడం లేదు. ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటివి ఎన్నో సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. నిజానికి పాలకపక్షం గట్టిగా ఉంటే అధికారపక్షం భయంగా ఉంటుంది. నిర్ణయాలు తీసుకునే ముందు జాగ్రత్త వహిస్తుంది. అయితే మోడీ అధికారం చేపట్టాక ఆయనకు అన్నీ కలసి వస్తున్నాయి. గట్టిగా విపక్షం లేకుండా పోయింది. విపక్షం ఉన్నా నిలదీయలేదన్న భరోసా దక్కింది. అసలు పార్లమెంట్‌కు వచ్చి గట్టిగా నిలబడి సమాధానం చెప్పే అవకాశం కూడా మోడీ కల్పించుకోవడం లేదు. పార్లమెంట్ సమావేశాల సమయంలో మోడీ ఎప్పుడూ కనిపించడం లేదు. ఇక ఏదైనా సమస్య లేవనెత్తితే ఎదురుదాడి రాజకీయాలతో సరిపుచ్చుతున్నారు. ఇలా దేశం అంటే పాలకులు,ప్రతిపక్షం అన్న విధంగా మారింది. ప్రజలు, వారి సమస్యలు, దేశం గాలికి ఎగిరిపోయింది. ఈ క్రమంలో విపక్షాల మధ్య ఐక్యత కూడా ఐసుగడ్డలా కరిగిపోతోంది. ఢిల్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల వరకే కూటమి అని ప్రధాన పార్టీల నేతలు ఇప్పటికే వ్యాఖ్యానించారు. కాబట్టి ఇకముందు కూటమి అన్నది ఉండదు. మొత్తంగా ఇండియా కూటమి మూడునాళ్ల ముచ్చటే అని తేలిపోయింది. విభిన్న సిద్ధాంతాలు, అభిప్రాయాలు గల దాదాపు 24 పార్టీలు ఏకంకావడమే గొప్ప. జెడి(యు) అధినేత నితీశ్ కుమార్ సూచనతో కేంద్రంలో బిజెపిని 2024 పార్లమెంటు ఎన్నికలలో ఓడించడమే లక్ష్యంగా కూటమి ఏర్పడింది. అనూహ్యంగా నితీశ్ మోడీ చంకలో చేరడంతో కూటమిలో కాంగ్రెస్ పెద్దన్నపాత్ర వహించాల్సి వచ్చింది. కూటమి కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఎన్నుకోవా లన్న భావన అదిలోనే దెబ్బతింది. ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన మమతా బెనర్జీ మొదటినుంచి ఇండియా కూటమిపట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ పెత్తనం ఆమెకు అసలే ఇష్టం లేదు. ఇక కమ్యూనిస్ట్‌ల పాత్ర కూడా అంతంతమాత్రమే. ఏచూరి మరణంతో అదికూఆడా లేకుండా పోయింది. బెంగాల్‌లో అసెంబ్లీ గానీ, పార్లమెంటు ఎన్నికలు గానీ ఏ ఎన్నికల్లో అయినా ఒంటరిపోరే తమ సిద్ధాంతంగా లెఫ్ట్ పార్టీల నేతలు ఎంచుకున్నారు. బెంగాల్‌లో 34 ఏళ్లు అధికారంలో ఉన్నా.. నానాటికీ వామపక్షాలు కనుమరుగు అవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పొత్తులో ఒక్క అసెంబ్లీ సీటు గెలిచారు. ఏపిలో అలాంటి అవకాశం కూడా లేదు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులకు కాలం చెల్లింది. బెంగాల్‌లో 48ఏళ్లుగా అధికారానికి దూరమై ఏ ఏటికాయేదు పతనమై.. ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిన కాంగ్రెస్, కమ్యూనిస్ట్ లతో కలిసినా కనీసం ఏ ఎన్నికలలోనూ విజయాన్ని అందుకోలేకపోయారు. పార్లమెంటు ఎన్నికల



నాటికి కూటమిలో కీలక పార్టీలు బిజెపికి దీటుగా ఒకే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలన్న లక్ష్యం లేకుండా పోయింద. ఆమ్‌ఆద్మీ పార్టీ కేజీవ్రాల్ పరిస్థితి మరోలా ఉంది. ఇష్టం లేకుండానే కూటమిలో చేరినా...లోక్‌సభ ఎన్నికల నాటికి ఢిల్లీలో పొత్తు.. పంజాబ్‌లో లేదు అన్నట్లు వ్యవహరించారు. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఒంటరి పోరాటానికే సిద్ధమయ్యారు. ఆయనకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, మమతా బెనర్జీలు మద్దతు పలికారు. ఢిల్లీలో కాంగ్రెస్ కన్నా ఆప్ బలంగా ఉందన్న వాదనను వీరు తీసుకునివచ్చారు. కాంగ్రెస్‌తో ఉన్నట్లే ఉన్నా.. ఎప్పటికప్పుడు ఆ పార్టీకి చెక్ పెట్టే ధోరణిలోనే అఖిలేశ్ వ్యవహరించారు. మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమితో ఆ పార్టీపై ప్రతిపక్షాలలో ముఖ్యంగా కూటమి పార్టీలలో పూర్తిగా నమ్మకంపోయింది. కాంగ్రెస్‌కు దాదాపు అన్ని పార్టీలు దూరమవుతున్నాయి. జమ్మూకశ్మీర్÷–లో కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్ కలిసినా, మహబూబా ముఫ్తీ ఒంటరి పోరుకు దిగారు. వయో భారం, అనారోగ్యం కారణంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ అంత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనడం లేదు. ఎన్‌సిపిను అజిత్ పవార్‌వర్గం చీల్చిన తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరద్ పవార్ ఇంటికే పరిమితమయ్యారు. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమి పూర్తిగా రద్దయి పోయినట్లయింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ రెండు టర్మ్‌లుగా అధికారంలో ఉంటోంది. పదేళ్లుగా కాంగ్రెస్ ఒక అసెంబ్లీ స్థానం కూడా గెలవలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, ఆమ్‌ఆద్మీ పార్టీకి మధ్యే అన్నట్లుగా కన్పిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోటీకి సిద్ధమైంది. ఇదో రకంగా ఆప్‌ను దెబ్బతీసే చర్యగానే చూడాలి. ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాకుండా చూడాలంటే.. ఆమ్‌ఆద్మీ పార్టీకి గంపగుత్తగా మద్దతు ఇవ్వాలని ఇండియా కూటమిలో కీలక పార్టీలు నిర్వహించాయి. దీంతో సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌జెడి, శివసేన ఉద్ధవ్ పార్టీ ఆమ్‌ఆద్మీ పార్టీకే మద్దతుగా నిలిచాయి. దీంతో కాంగ్రెస్ ఏకాకి అయింది. ఆ పార్టీకి ఆఖరుకు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా దూరమైంది. ఇండియా కూటమి అన్నది కేవలం పార్లమెంటు ఎన్నికల కోసం ఏర్పడిం దని ఆయన ప్రకటించారు కూడా. దీంతో ఇండియా కూటమి ముక్కచెక్కలైనట్లు స్పష్టమైంది. అయితే కూటమి కట్టడం వల్ల మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లాభించిందనే చెప్పాలి. అవసానదశలో ఉన్న ఆ పార్టీ విపక్ష స్థాయికి ఎదిగింది. ఇప్పుడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్ని పార్టీలు కూటమి నుంచి వైదొలిగినా కాంగ్రెస్‌కు వచ్చే నష్టం లేదు. కుటుంబం లోని ముగ్గురు సభ్యులు పార్లమెంటులో ప్రవేశించారు. ఇలా అన్ని పార్టీలు కుటుంబపార్టీలుగా మారాయి. కాబట్టి ప్రజలకన్నా కుటుంబ సమస్యలకే వీరు ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్లమెంటులో సమస్యలపై చర్చ కూడా అందుకే మొక్కుబడిగా సాగుతున్నాయి. విపక్షాల అనైక్యతను మోడీ తనకు అనుకూలంగా మలచుకుని మూడోసారి ప్రధానిగా దేశాన్ని ఏలుతున్నారు. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు కూడా మోడీని నిలదీసే విషయంలో ముందుకు రారని తేలిపోయింది. మొత్తంగా అధికార పక్షాన్ని గట్టిగా నిలదీసే విపక్షం దేశం లేకపోవడం ప్రజల దౌర్భాగ్యం కాక మరోటి కాదు.

# ఆందోళన నిరసనలతో దద్దరిల్లిన బల్దియా..



నిజామాబాద్ : నిజామాబాద్ నగర పాలక సంస్థ చివరి కౌన్సిలింగ్ సమావేశం ఆందోళనలు, నిరసనల మధ్య అర్ధాంతరంగా ముగించారు. సమావేశం ప్రారంభానికి ముందు మజ్లిస్ పార్టీ నాయకులు వీధి వ్యాపారుల సమస్య పరిష్కారంపై ఆందోళన చేపట్టారు.వీధి వ్యాపారుల చిన్న సమస్యపై కౌన్సిలింగ్ సమావేశంలో రచ్చ రచ్చ చేశారు. నగరాభివృద్ధికి సంబంధించిన ఎన్నో అంశాలు ఉన్నా.. అవి పక్కన పెట్టి కేవలం చిన్న సమస్యపై రాద్ధాంతం చేసి అర్ధాంతరంగా ముగించేశారు.శనివారం నిజామాబాద్ నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ దండు నీతి కిరణ్ అధ్యక్షతన కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ, డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్ మున్సిపల్ కమిష నర్ దిలీప్ కుమార్, కార్పొ రేటర్లు, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు.సమావేశములో గత 5 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని మేయర్ క్లుప్తంగా వివరించారు. సమావేశములో నగర మేయర్ 39 అంశాలను ప్రవేశ పెట్టిన అంశాలు చదువుతున్న క్రమంలో మజలీస్ పార్టీ నాయకులు అభ్యంతరం తెలుపుతూ వీధి వ్యాపారుల సమస్య పరిష్కారం తర్వాతనే ఎజెండాలోని అంశాలను ఆమోదించాలని పోడియం వద్ద నిరసన చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎలా వ్యవహరిస్తారు?

రోడ్డుపైన ఎక్కడపడితే అక్కడ వీధి వ్యాపారులు చిరు వ్యాపారుల వల్ల తీవ్ర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ చెప్పారు. ట్రాఫిక్ కు కూడా తీవ్ర అంత రాయం ఏర్పడు తుందని తెలిపారు. వీధి వ్యాపారులకు ఒక ప్రత్యామ్నాయ మార్గం చూయించామని అన్నారు.

ప్రత్యామ్నాయ మార్గం చూయిం చకుంటే తప్పు%౯% కానీ చిన్న సమస్యపై ఇంత రాద్ధాంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వీధి వ్యా పారుల సమస్యపై కౌన్సెలింగ్ సభ్యుల అందరి అభిప్రాయం మేరకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అందులో ప్రజా ప్రతి నిధులను, పలుశాఖ అధి కారులను సభ్యులుగా నియమించి త్వర లోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ప్రత్యేక కమిటీపై బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఒప్పుకున్నారు. కానీ మజ్లిస్ పార్టీ సభ్యులు ససేమిరా ఒప్పుకోకుండా పోడియం పాయింట్ వద్ద నినాదాలు చేస్తూ ఛాంబర్ బయట నుంచి ఆందోళన చేపట్టారు.

వీధి వ్యాపారులను తొలగించవద్దని ఎజెం డాలో తీర్మానించాలి

నిజామాబాద్ నగరంలోని వీధి వ్యాపారులు చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మాస్టర్ ప్లాన్ వచ్చేంత వరకు రోడ్డుపై నుంచి తొలగించకుండా ఎజెండాలో తీర్మానించాలని మజలీస్ పార్టీ కార్పొ రేటర్లు డిమాండ్ చేశారు. ఇందుకు బిజెపి , బీఆర్ ఎస్ కార్పొరేటర్లు ఒప్పు కోలేదు. దీంతో మజలీస్ పార్టీ కార్పొరే టర్లుబయటకు వెళ్లి సమావేశం హాలు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కౌన్సిలింగ్ సమావేశంలో ఆందోళన నిరసనల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

అర్ధాంతరంగా సమావేశం ముగించడం పై బిజెపి కార్పొరేటర్ల ఆందోళన కౌన్సెలింగ్ సమావేశంలో ఎజెండాలోని అంశాలు ఆమోదం తెలపకుండానే అభ్యంతరంగా సమావేశాన్ని ఎలా ముగిస్తారని ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, బిజెపి కార్పొ రేటర్లు చాంబర్ బయట బైటాయించి నుంచి నిరసనచేశారు. మేము వీధి వ్యాపారులకు వ్యతిరేకం కాదని వీధి వ్యాపారుల సమస్య పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాల మేరకు సమస్య పరి ష్కారానికి కృషి చేయాలని తెలిపినట్లు తెలిపారు.కానీ మాస్టర్ ప్లాన్ వచ్చేంతవరకు వీధి వ్యాపారులను తొలగించేది లేదని ఎజెండాలో తీర్మానం చేపట్టాలని మజ్లిస్ వారి డిమాండ్ ని ఖండించారు. రోడ్డుపైన కూరగాయల వ్యాపారం మొదలుకొని చిరు వ్యాపారులు తోపుడుబండ్లతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.నగర అభివృద్ధిపై చర్చించాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి.. కానీ చిన్న సమస్యపై ఇంత రాద్ధాంతం చేయడం సిగ్గుచేటు అన్నారు. సభ్యుల ఆమోదం లేకుండా అర్థాంతరంగా సమావేశం ఎలా ముగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నగర మెయర్ దండు నీతు కిరణ్

కౌన్సిలింగ్ సమావేశంలో 39 అంశాలను ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదంతో ఆమోదించినట్టు నగర మేయర్ దండు నీతి కిరణ్ తెలిపారు. గత 5 సంవత్సరాల అభివృద్ధిలో భాగస్వాములైన మాజీ ఎమ్మెల్యే బిగాల, గణేష్ గుప్తకి, ఎంపీనగర ఎమ్మె ల్యే ధన్ పాల్ సూర్యనా రాయణ కి, మాజీ ఎమ్మె ల్సిలు, కార్పొ రేటర్లు, అధికారులకు నగర మేయర్ దండు నీతూ కిరణ్, ధన్య వాదాలు తెలిపారు.

వీధి వ్యాపారుల సమస్యపై రచ్చ రచ్చ

రోడ్డుపైనే వ్యాపారం చేసే వీధి వ్యాపారులు చిరు వ్యాపారుల సమస్య పై కౌన్సిలింగ్ సమావేశంలో రసాబసాగా కొనసాగింది. నగర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ చేయాల్సినప్పటికీ ఎలాంటి చర్చ జరగకుండానే సమావేశం ముగిం చడం పై కాంగ్రెస్ కార్పొ రేటర్లు మండిపడ్డారు. నగర అభివృద్ధికి సంబం ధించి కార్పొరేటర్లకు మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఏట్టకేలకు చిన్న సమస్యపై ఆందో ళనలు నిరసన మధ్య కౌన్సిలింగ్ సమావేశాన్ని మమా అనిపించారు.

# ఢిల్లీలోని అద్దెవారికి తాగునీరు, విద్యుత్ ఉచితం

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరో ఎన్నికల హామీ ప్రకటించారు. ఢిల్లీలో నివసించే అద్దెదారులకు విద్యుత్, తాగు నీరు ఉచితంగా అందిస్తామని తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'మేం ఢిల్లీ నివాసితులకు ఉచిత విద్యుత్, ఉచిత తాగు నీరు అందించాం. అయితే అద్దెదారులకు ఈ ప్రయోజనాలు లభించకపోవడం దురదృష్టకరం. ఎన్నికల తర్వాత మా ప్రభుత్వం ఏర్పడితే, అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్, తాగు నీరు అందించే వ్యవస్థను ప్రవేశపెడతాం' అని అన్నారు. కాగా, ఢిల్లీలో నివసిస్తున్న చాలా మంది అద్దెదారులు పూర్వాంచల్‌కు చెందినవారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. వారిలో చాలా మంది చాలా పేదవారని చెప్పారు. వారు ఎలాంటి సబ్సిడీలు పొందలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిని పరిష్కరించడానికి తాము ప్రయత్నిస్తామని కేజ్రీవాల్ తెలిపారు. మళ్ళీ అధికారంలోకి వస్తే ఢిల్లీలోని ఇంటి అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్, ఉచిత తాగు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. అయితే ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి రావాలని ఆప్ ఆశిస్తున్నది.

# ఫ్యూచర్‌కు తిరుగులేదా?

అమరావతి,ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమిగానే రంగంలోకి దిగుతాం. మొన్న గెలిచామని లైట్ తీసుకోవడం లేదు.. ఇంకో పదిహేనేళ్లు టీడీపీతోనే దోస్తీ అంటున్నారు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్. కలిసి కదం తొక్కి మొన్నే సత్తా చాటాం..రాబోయే రోజుల్లోనూ కలిసే నడుస్తాం..నవ్యాంధ్రను ఒక్కో మెట్టుపైకి ఎక్కిస్తామంటూ..కూటమి ఫ్యూచర్‌పై అటు సీఎం చంద్రబాబు, ఇటు డిప్యూటీ సీఎం పవన్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు.మరో పదిహేనేళ్లు కలిసే ఉండాలని భావిస్తున్నాం. రెండు రోజుల నుంచి డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలివి. గతంలోనూ కూటమిగానే ముందుకెళ్తామని చెప్పారు పవన్. ఇప్పుడు మరింత గట్టిగా తన వాదనను వినిపిస్తున్నారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతల మధ్య అక్కడక్కడ విభేదాలు వచ్చాయి. నియోజకవర్గాల్లో మూడు పార్టీల లీడర్లకు కోఆర్డినేషన్ మిస్ అవడంతో పాటు వైసీపీ నుంచి వచ్చే నేతల చేరికల విషయం లోనూ కాస్త గ్యాప్ ఏర్పడింది.

కుండ బద్దలుకొట్టి చెబుతున్న పవన్

అనంతపురంలో బీజేపీ వర్సెస్ టీడీపీ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో టీడీపీ వర్సెస్ జనసేన.. ఇలా పలు జిల్లాల్లో కూటమి నేతల మధ్య గొడవలు రాజకీయంగా ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇలాంటి సందర్భాల్లో పొత్తు ఉంటుందని కుండ బద్దలుకొట్టి చెప్తున్నారు పవన్. అయితే నియోజకవర్గాల్లో మూడు పార్టీల నేతల సఖ్యత కుదరకపోవడంతో పొత్తు కష్టమేనన్న వాదనలు వినిపించాయి. అయినా ఎక్కడా కూడా గాడి తప్పకుండా పొత్తు రథం పదిలంగా ముందుకు సాగింది.అయితే పొత్తు విషయంలో బాబు కంటే ముందే పవన్ క్లారిటీతో ఉన్నారు. పలుమార్లు సేనాని ఓపెన్‌గానే స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. ఇంకో పదేళ్లు చంద్రబాబే సీఎంగా ఉండాలని ఆ మధ్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు పవన్. బాబు దూరదృష్టితో ఏపీ మరింత డెవలప్ అవుతుందని చెప్పుకొచ్చారు.ఆ తర్వాత కూటమి ఫ్యూచర్‌పై హస్తిన వేదికగా సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. జమిలి ఎన్నికలు వచ్చినా..2029లో ఎలక్షన్స్ జరిగినా కలిసే పోటీ చేస్తాం.. ఇప్పటి నుంచే ఎన్నికలకు రెడీ అవతున్నామంటూ బాబు చెప్పడం హాట్ టాపిక్ అయింది. అధికారంలోకి వచ్చాం..అవసరమైపోయిందని కాకుండా..కలసి నడిస్తే పార్టీలకు, ప్రజలకు జరిగే మేలొంటి తెలిసిన నాయకులుగా అటు చంద్రబాబు, ఇటు పవన్ బిహేవ్ చేస్తున్నారు.ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాయి. ఇందులో ఒక్క టీడీపీకి మాత్రమే గెలుపును సొంతం చేసుకునేంత ఓటు బ్యాంకు ఉంది. జనసేనకు పవన్ ఇమేజ్, క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ సొంతంగా గెలిచేంత బలం లేదు. అలా అని కీలకం కాదని చెప్పలేం.ఏపీలో గెలుపోటములను డిసైడ్ చేసేంత సత్తా మాత్రం జనసేకు ఉంది. ఇక బీజేపీ అయితే కూటమితోనే అన్నో ఇన్నో సీట్లు సంపాదిస్తూ వస్తోంది. సో ఈ నేపథ్యంలో అధికారంలో ఉండాలని కోరుకునే ఈ మూడు పార్టీలు..కలిసి పోటీ చేస్తేనే పవర్ స్టీరింగ్‌ను పట్టుకోగలవన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.పొత్తుపై ముందే అలర్ట్ అవడం వెనుక ఇంకో స్ట్రాటజీ ఉందట. ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా అంతో ఇంతో ప్రజావ్యతిరేకత కామన్. డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండే ఆ ఓటు షేర్ మీదే గెలుపోటములు డిపెండ్ అయి ఉంటాయ్. అందుకే ఎవరిదారి వారిదే అని కాకుండా..లాంగ్ లివ్ కూటమి అంటున్నారు బాబు, పవన్.రాష్ట్రంలో జనసేన, బీజేపీ కంటే టీడీపీ ఓటు బ్యాంకే ఎక్కువ. ఆ పార్టీనే బూత్ స్థాయి వరకు చాలా స్ట్రాంగ్‌గా ఉంది. ఆ తర్వాత ప్రతీ ఊర్లో పవన్‌కు అభిమానులు ఉంటారు. అంత పటిష్టంగా ఉండి కూటమిని లీడ్ చేస్తున్న టీడీపీ, జనసేన అధినేతలే పొత్తు ఉంటుందని పదేపదే చెప్పడం వెనుక పెద్ద ప్లానే ఉన్నట్లు కనిపిస్తోంది.

# డైరెక్ట్ ఫైట్..

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్దపీట వేస్తామన్న హై కమాండ్ కార్పొరేషన్ పదవులలో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు అవకాశం ఇవ్వాలి లేదంటే న్యాయం పోరాటం చేస్తా అంటూ గాంధీ భవన్ వేదికగా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సునీతాని కొంత దూరం పెట్టినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా తన పదవీకాలం ముగిసినా కూడా ఆమెను ఇంకా కొనసాగిస్తున్నప్పటికి నాకు మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గా కొనసాగించాలి లేదంటే బీసీ మహిళ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని పట్టుబడుతుందట.ఈ నేపథ్యంలో మొన్నటివరకు ఢిల్లీ ఉండి హై కమాండ్ పెద్దలను కలిసి తనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని లాబీయింగ్ చేసి ఫలితం లేక హైదరాబాద్ తిరిగి వచ్చిందని ప్రచారం జరుగుతోంది. దీనితో మహిళలకు కాంగ్రెస్ తగిన ప్రాధాన్యం ఇవ్వక పోతే మంత్రులను నిలదీయాలని గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంచలన కామెంట్స్ చేసింది. రెండు రోజుల క్రితం మహిళ కాంగ్రెస్ కమిటీలు వేసి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శులను ఇందిరా భవన్ లో ప్రకటించింది.కానీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు సమాచారం ఇవ్వకపోవడంతో పీసీసీకి, సునీతా రావుకు గ్యాప్ ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో సునీతా రావు వ్యవహారం పీసీసీకి అటు హైకమాండ్‌కు తలనొప్పిగా మారిందట. మహిళా కాంగ్రెస్ నేత సునీతా రావు వ్యవహారంను గమనిస్తున్న ఇటు టీ–కాంగ్రెస్, అటు హైకమాండ్ ఏ విధంగా తీసుకుంటుంది. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సునీతారావుకు ప్రాధాన్యం ఇస్తారా? లేక మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా కొనసాగిస్తారా? ఆమె కామెంట్స్‌ను ఏవిధంగా తీసుకుంటారో చూడాలి.

# అదును చూసి చేతివాటం ప్రదర్శించిన కంత్రీగాళ్లు..!



వరంగల్: అలా వస్తారు ఇలా తెంపుకుపోతారు.. చైన్ స్నాచర్స్ దెబ్బకు ఒంటరిగా వెళ్లాలంటనే మహిళలు భయపడుతున్నారు. వరంగల్ జిల్లాలో జరిగిన ఘటననే ఇందుకు నిదర్శనం. పోలీసులు వివిధ క్రీడల్లో పోటీ పడుతూ రిలాక్స్ అవుతున్నారు. అదును చూసి దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ హడలెత్తిస్తున్నారు తెంపుడుగాళ్లు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం జరుగుతుంది. పోలీసులు వివిధ క్రీడల్లో పోటీ పడుతూ రిలాక్స్ అవుతున్నారు. అదును చూసి దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వరంగల్‌లోని గిర్మాజీపేట రాములవారివీధిలో చైన్ స్నాచింగ్ జరిగింది. శుక్రవారం(జనవరి 18) మధ్యాహ్నం లక్ష్మీ అనే మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఆమె మెడలో నుండి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి పుస్తెల తాడు తెంచుకెళ్ళాడు. బాధితురాలి అరుపులు విని అతన్ని పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వరంగల్ లోని జేపీఎన్ రోడ్ ప్రాంతానికి చెందిన లక్ష్మీ మహిళ గ్రూపు మీటింగ్ కు వెళ్లి తిరిగి వస్తోంది. ఈక్రమంలో అక్కడ మాటు వేసిన చైన్ స్నాచర్ బైక్ పై వచ్చి మెడలోని పుస్తేలతాడు లాక్కెళ్ళాడు. సుమారు రెండున్నర తులాల బరువున్న బంగారు పుస్తెలతాడు చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిన్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

# ఇంటర్ సిలబస్‌లో మార్పులు.. ఏఐ,డేటా సైన్స్‌కు చోటు?

హైదరాబాద్, ఇంటర్ సిలబస్‌లో మార్పులు–చేర్పులు జరుగుతున్నాయా? మారిన సిలబస్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానుందా? కొన్ని పాఠాలను తొలగించాలని ఇంటర్ బోర్డు ఇప్పటికే నిర్ణయం తీసుకుందా? రాబోయే కొత్త పాఠాలేంటి? ఇవే ప్రశ్నలు చాలామంది విద్యార్థులను వెంటాడుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంలో ఇంటర్ విద్యలో మార్పులు చేయాలని భావిస్తోంది తెలంగాణ బోర్డు. ఇప్పటికే వేసిన కమిటీ కసరత్తు చేసింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఆర్ట్స్‌లో కొన్ని పాఠాలను తొలగించాలని నిర్ణయం తీసుకుంది. వాటి స్థానంలో ఏయే పాఠాలు ప్రవేశపెట్టబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. ఇంటర్ ఫిజిక్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ, రోబోటిక్స్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ పాఠాలను చేర్చాలని భావిస్తోంది. జువాలజీకి వస్తే కొవిడ్ మహమ్మారి లాంటి వ్యాధులపై అవగాహన పెంచేలా మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. మారిన సిలబస్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకురావాలన్నది బోర్డు ఆలోచన. ఇంటర్ సెకండియర్‌లో ఎలక్ట్రానిక్స్ ఛాప్టర్‌లో కొంత పార్టు తొలగించి, వాటి స్థానంలో వీటిని ప్రవేశపెట్టాలని సూచన చేసింది. మార్కెట్‌లో ఆయా కోర్సులకు డిమాండ్ ఉండడమే కారణంగా తెలుస్తోంది. ఈ తరహా కోర్సులకు బీటెక్ మాత్రమే కాకుండా డిగ్రీలో ఫుల్ డిమాండ్ ఉంది. ఈ క్రమంలో ఆయా సబ్జెక్టులను విద్యార్థులకు పరిచయం చేయాలన్నది బోర్డు ఆలోచనగా తెలుస్తోంది. ఇటు




జువాలజీ గ్రూపులో స్వల్ప మార్పులు జరగనున్నాయి. కొవిడ్ పాఠాన్ని చేర్చాలని నిర్ణయించిందట బోర్డు. ఆ తరహా వ్యాధులు వస్తే ఎలాంటి అవగాహన కల్పించాలని అనే అంశాలు పొందుపరుస్తున్నారు. వీటిపై విద్యార్థులకు ఏ మాత్రం భార పడకుండా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇటు ఐఐటీ, అటు నీట్ దృష్టిలో పెట్టుకుని సిలబస్‌లో మార్పులు చేస్తున్నామన్నది కొందరి అధికారుల మాట. సీనియర్ ప్రొఫెసర్లు, లెక్చరర్లతో సిలబస్ కమిటీలు వేసింది ఇంటర్ బోర్డు. ఆ కమిటీ ఇదే పనిలో నిమగ్నమైంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ గ్రూపుల్లో కొన్ని పాఠాలు తొలగించనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి చాన్నాళ్లు తర్వాత ఇంటర్మీడియట్‌లో కొత్త పాఠాలు రాబోతున్నాయన్నమాట.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఇక లేనట్లే..

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్ అంశంగా మారిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆ సంస్థను పునరుద్ధరించేందుకు ఉద్దీపన ప్యాకేజిని ప్రకటించడంపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. దాదాపు రూ. 35 వేల రుణభారం, నష్టాలతో సతమతమవుతున్న ఈ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ. 11,440 కోట్ల ప్యాకేటీ కేటాయించింది. ఈ మొత్తం సరిపోదని, ఇది మొదటి ప్యాకేజి మాత్రమేనని కేంద్ర మంత్రులు కూడా స్పష్టం చేశారు. అయితే మొదటి ప్యాకేజితో ఆగస్టు వరకు సంస్థలోని 3 బ్లాస్టింగ్ ఫర్నేస్‌లను పనిచేయిస్తూ పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యమని, తద్వారా సంస్థలను లాభాల బాట పట్టిస్తూ మెల్లమెల్లగా అప్పులు తీర్చుకుంటూ పోతూ గాడిలో పెట్టాలన్నది తమ లక్ష్యమని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ టీవీ9తో తెలిపారు. పూర్తిగా 100% కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన %=×చీూ%లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రైవేటీకరించాలని గతంలో నిర్ణయించిన కేంద్రం.. ఇప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకుందని స్పష్టమవుతోంది. వ్యవసాయ రంగంలో సంస్కరణలు తీసుకొస్తూ 3 చట్టాలను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం రైతుల ఆందోళన నేపథ్యంలో వెనక్కి తగ్గి.. ఆ చట్టాలను ఉపసంహరించుకోవడం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విషయంలో రెండోసారి తన నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తగ్గినట్టయింది. అయితే కేంద్ర నిర్ణయంపై అసలు చర్చ వేరే ఉంది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగ సంఘాలు.. వీలైతే సంస్థకు ఉద్దీపన ప్యాకేజి ప్రకటించి ఆదుకోవాలని, లేదంటే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లో విలీనం చేయాలని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం కూడా లాభాల్లో నడుస్తున్న సెయిల్‌లో విలీనం చేస్తుందనే అందరూ భావించారు. కానీ అందుకు భిన్నంగా ఉద్దీపన ప్యాకేజి ప్రకటించడంతో అసలేం జరుగుతుందో ఎవరికీ అంతుచిక్కడం లేదు.

విలీనానికి సెయిల్ షరతులు..?

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ( పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ. ఆ సంస్థ తీసుకునే నిర్ణయాలు స్టాక్ మార్కెట్లో కంపెనీ షేర్ విలువను ప్రభావితం చేస్తుంటాయి. ఏకంగా రూ. 35 వేల రుణభారం, బకాయిలతో సతమతమవుతున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను సెయిల్ టేకోవర్ చేస్తే.. ఆ సంస్థ బ్యాలెన్స్ షీట్ ప్రభావితమవుతుంది. సంస్థ ఆస్తులు, అప్పుల్లో RINL వాటా చేరుతుంది. తద్వారా SAIL షేర్ల విలువ పడిపోతుందని ఆ సంస్థ ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ను టేకోవర్ చేయాలంటే.. ముందు ఆ సంస్థ బ్యాలెన్స్ షీట్ సరిచేయాలని షరతు పెట్టినట్టు తెలిసింది. వాటిలో నష్టాలు, అప్పుల భారాన్ని తగ్గించాలన్నది మొదటి కండిషన్‌గా తెలిసింది. రెండోది.. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని కూడా షరతు పెట్టినట్టు సమాచారం. ఎందుకంటే.. అక్కడ ఒక ఉద్యోగానికి నలుగురు (1:4) నిష్పత్తిలో నియామకాలు జరిగాయని.. ఉద్యోగుల భారం కూడా సంస్థ నష్టాలకు కారణమన్నది సెయిల్ అభిప్రాయంగా కనిపిస్తోంది. సెయిల్‌లో కూడా ఒకప్పుడు 2 లక్షల మంది ఉద్యోగులు ఉండేవారని, అప్పుడు సంస్థ ఉత్పత్తి సామర్థ్యం




12 మిలియన్ టన్నులు మాత్రమే ఉండేది. కానీ స్టీల్ రంగంలో ప్రైవేట్ సంస్థలు తక్కువ సిబ్బందితో ఎక్కువ ఉత్పత్తి సాధిస్తూ లాభాల్లో దూసుకెళ్తుండడంతో.. సెయిల్ కూడా ఉద్యోగులపై కోత పెడుతూ వచ్చింది. స్వచ్ఛంద పదవీ విరమణ సహా వివిధ మార్గాల్లో 2 లక్షల నుంచి ప్రస్తుతం అటూ ఇటుగా 50 వేల మందికి కుదించింది. అదే సమయంలో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం 20 మిలియన్ టన్నులు దాటింది. అలా సెయిల్ లాభాల బాట పట్టింది. ఉద్యోగుల సంఖ్యను మరింత కుదించి 35 వేల మందికి తీసుకురావాలన్నది ఆ సంస్థ లక్ష్యంగా తెలిసింది. ఇలాంటి ప్రణాళికల్లో ఉన్న సంస్థ దాదాపు ఖాయిలాపడ్డ స్థితిలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను నేరుగా టేకోవర్ చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన చెందింది. అందుకే ముందు సంస్థ బ్యాలెన్స్ షీట్‌ను సరిచేసి, ఉద్యోగుల సంఖ్యను తగ్గించి.. ఆపరేషనల్ ప్రాఫిట్‌లోకి తీసుకొస్తే అప్పుడు టేకోవర్ చేసే అవకాశం కనిపిస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఉన్న విస్తారమైన ల్యాండ్ బ్యాంక్ విలువను గణిస్తే.. ప్రస్తుతం ఎదుర్కొంటున్న నష్టాలు, అప్పుల కంటే ఎక్కువే. అయినప్పటికీ.. సంస్థను కాస్త సరిదిద్దిన తర్వాతనే టేకోవర్ చేయాలని సెయిల్ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. సెయిల్ షరతులకు తగ్గట్టే ఓవైపు ఉద్దీపన ప్యాకేజితో పాటు మరోవైపు వీఆర్ఎస్ ద్వారా ఉద్యోగులు, కార్మికుల సంఖ్యను తగ్గించే చర్యలు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కనిపిస్తున్నాయి. అంటే.. విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తులో సెయిల్‌లో విలీనమయ్యే అవకాశాలున్నాయని దీన్ని బట్టి అర్థమవుతుంది. కేంద్ర మంత్రుల మీడియా సమావేశంలో ఈ అంశంపై వారిచ్చిన సమాధానం కూడా ఇదే మాదిరిగా ఉంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడమే నష్టాలకు కారణమన్న వాదనను తోసిపుచ్చుతూ.. సంస్థకు ఒడిశాలో క్యాప్టివ్ మైన్స్ (సొంత గనులు) ఉన్నాయని, కాకపోతే ఇప్పటి వరకు అక్కడ మైనింగ్ కార్యాకలాపాలు ప్రారంభించలేదని కేంద్ర మంత్రులు స్పష్టం చేశారు. ఏదేమైనా.. ఈ ఉద్దీపన ప్యాకేజితో సంస్థ మళ్లీ గాడిలో పడితే.. "విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు" భవిష్యత్తులో ప్రైవేటుపరం కాకుండా నిలదొక్కుకుంటుంది. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకోవాలని ఏ ప్రభుత్వమూ కోరుకోదు. పైగా ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే ఉద్దీపన్ ప్యాకేజీలు అంటే.. సామాన్య ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కట్టిన పన్నుల సొమ్మే అన్న విషయాన్ని సంస్థ ఉద్యోగులు, యాజమాన్యం మర్చిపోరాదు.

# నేను పోట్లాడుతా.. ఇమేజ్ కోసమేనా ఇదంతా?



హైదరాబాద్,వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరు సొంత పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది.. సంబంధం ఉన్నా లేకపోయినా ప్రతి ఇష్యూలో వేలు పెట్టడం అతనికి అలవాటుగా మారిపోయింది.. ఎవరి అండదండలు చూసుకుని కౌశిక్ రెడ్డి అంతా దూకుడుగా వెళ్లుతున్నారన్న చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతుంది%ా% మొదటి సారి ఎమ్మెల్యే అయిన కౌశిక్ తన ఇమేజ్ పెంచుకోవడానికి అలా వ్యవహారిస్తున్నాడా..? ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని వీడిబీఆర్ఎస్‌లోకి వచ్చిన కౌశిక్ రెడ్డి. పార్టీలో తన ఉనికిని చాటుకోవడాకే ఇలా చేస్తున్నారా..? పార్టీ పెద్దలకు తెలిసే ఇదంతా జరుగుతుందా? హుజురాబాద్ నుంచి శాసనసభకు మొదటి సారి ఎన్నికైన పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచేందుకు సెంటిమెంటునే నమ్ముకోవాల్సి వచ్చింది. సెంటిమెంట్ అంటే ఇంకేదో అనుకునేరు.. అంత సీన్ లేదు లేండి.. గెలిస్తే మంత్రి అవుతానన్న ఆశతో.. గెలిపించకపోతే చావే శరణ్యమని ప్రజల్ని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి ఎలాగోలా గట్టెక్కారాయన. అలాంటి సెంటిమెంట్ డైలాగులు పండించి త్రిముఖపోటీలో విజయం సాధించారు. అయితే అతను గెలిచాడు కాని బీఆర్ఎస్ ఓటమి పాలవ్వడంతో ఆయన అమాత్యపదవి పదవి ఆశలు ఆవిరయ్యాయి. ఈటల రాజేందర్ గులాబీ పార్టీలో ఉన్నప్పుడు ఆయనపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కౌశిక్‌రెడ్డి గత ఎన్నికల్లో టికెట్ కోసం గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయన నోటి దూకుడు పుణ్యాన ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లోకి వద్దామన్నా డోర్లు తెరుచుకునే పరిస్థితి లేకండా పోయింది .. ఫస్ట్ టైం ఎమ్మెల్యే అయిన కౌశిక్ రెడ్డి తన ఉనికి చాటుకోవడానికి ప్రదర్శిస్తున్న దూకుడు%ా% చేస్తున్న ఓవర్ యాక్షన్ ఎప్పటికప్పుడు ఆయన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేస్తున్నాయంటునారు .. ఆ దుందుడుకు వ్యవహారం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద సమస్యగా మారిందని గులాబీ శ్రేణులే అంటున్నాయి. చిన్న చిన్న విషయాలకు కూడా గొడవలకు వెళ్లడం.. తనకు సంబంధం లేని అంశాల్లో వేలు పెట్టి సవాళ్లు విసరడం %ా% మీసాలు తిప్పడం, తొడలు కొట్టడం లాంటి వాటితో కౌశిక్‌రెడ్డి తాను ఎమ్మెల్యేనన్న విషయం మర్చిపోతున్నారని బీఆర్ఎస్ నేతలు సైతం అసంతృప్తిగా ఉన్నారట.. సొంత పార్టీ నేతల్లో తనపై నెగిటివ్ పెరుగుతున్నా ..కౌశిక్ రెడ్డి మాత్రం నేనింతే అన్నట్లు .. తాను ఎమ్మెల్యే అనే విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తూ పార్టీకి ఉన్న కాస్త పరువుని తీసేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒక ఎమ్మెల్యే వ్యవహరించాల్సినట్లు ఆయన ప్రవర్తన ఉండట్లేదని సొంత నియోజకవర్గ ప్రజలే అభిప్రాయ పడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌పై కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు తీవ్ర దుమారంగా మారింది%ా% జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరైన ఆ సమావేశంలో బజారు రౌడీలా వ్యవహరించిన కౌశిక్‌రెడ్డిని పోలీసులు కలెక్టరేట్ నుంచి బయటకు లాక్కెల్లాల్సి వచ్చింది %ా% జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన కౌశిక్‌రెడ్డిపై మూడు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ ఏదో ఒక వివాదం రేగుతోందనే టాక్ బీఆర్ఎస్ వర్గాల్లోనే వినిస్తుంది. అది పోలీస్ స్టేషన్ కావచ్చు, జిల్లా సమీక్ష సమావేశం మందిరం కావచ్చు, ప్రెస్ మీట్ కావచ్చు, అసెంబ్లీలో ఇలా ప్లేస్ ఏదైనా ఆయన వీధి గూండాలా వ్యవహరిస్తున్న తీరు బీఆర్ఎస్ నేతల్లో హాట్ టాపిక్ మారింది .. తనకంటే సీనియర్ నేతలు . రెండు, మూడుసార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కౌశిక్ రెడ్డి వాడుతున్న బాష, పదజాలానికి సంబంధించి కూడా కారు పార్టీ నేతలు సైతం పెదవి విరుస్తున్నారట.. కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని బీఆర్ఎస్ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.. అతనికే చెప్దామంటే ఎలా రియాక్ట్ అవుతాడో అని సైలెంట్ అవుతున్నారంట. కౌశిక్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండదండలు పుష్కలంగా ఉన్నాయని అందుకే గులాబీ పెద్దలు కూడా కౌశిక్ రెడ్డిపై ఏమీ మాట్లాడలేక పోతున్నారని బీఆర్ఎస్ నేతలు గొణుక్కుంటున్నారు.. కేసీఆర్ అయినా జోక్యం చేసుకుని కౌశిక్ రెడ్డిని కంట్రోల్ చేస్తే బాగుంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారట .. ఆయన వల్ల పార్టీకి లేనిపోని సమస్యలు ఎదురవుతున్నాయని.. భవిష్యత్తులో ఆయన వల్ల పార్టీకి మరింత చెడ్డపేరు రావడం ఖాయమని వాపోతున్నారు.. మొండోడు రాజు కంటే బలవంతుడంటారు మరి మొండి తనానికి పరాకాష్ట లాంటి కౌశిక్ రెడ్డి గులాబీ బాస్ చెప్తే అయినా తన స్టైల్ మార్చుకుంటారో లేదో చూడాలి.

# కుంభమేళాకు పెరుగుతున్న భక్తజన తాకిడి



ప్రయాగ్‌రాజ్, కుంభమేళా జరుగుతున్న త్రివేణీ సంగమ తీరం భక్తకోటితో నిండిపోతోంది. కనుచూపుమేర ఎటుచూసినా భక్తుల పుణ్యస్నానాలే కనిపిస్తున్నాయి. రోజూ రెండుకోట్లకు తగ్గకుండా భక్తులు వస్తున్నట్లుగా అంచనా వేస్తున్నారు. మరీ ముఖ్యంగా.. విదేశీయులు సైతం కాషాయ వస్త్రాలు, రుద్రాక్షలు ధరించి పుణ్యస్నానాలు చేస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ఆధ్యాత్మిక సంగమం ఒక విశ్వ సంబరంగా మారింది. నదీ స్నానం సర్వ పాప హరణం అని హిందూ ధర్మశాస్త్రం చెబుతోంది. అందులోనూ పరమ పవిత్రమైన గంగా నది, తోడుగా యమున, అంతర్వాహినిగా సరస్వతి ఒకేచోట సంగమించే ప్రదేశంలో నదీ స్నానం ఆచరించడం జన్మజన్మల పాపాలను హరిస్తుందనేది హిందువుల విశ్వాసం. పైగా.. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా ఇది. ఇప్పుడు తప్పితే . మళ్లీ ఇలాంటి మహా కుంభమేళాలో పాల్గొనడం దాదాపుగా అసాధ్యం. అందుకే.. పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అందులోనూ, మకర సంక్రాంతి నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం రావడంతో.. వివిధ వర్గాలకు చెందిన 13 అఖాడాలు మహాకుంభమేళాకు వచ్చాయి. ఈ అఖాడాలు తెల్లవారుజామున 3 గంటలకు బ్రహ్మముహూర్తంలో అమృత స్నానాలు ప్రారంభించేస్తున్నారు. ఏరోజు కూడా కోటిన్నరకు తగ్గకుండా భక్తులు అమృత స్నానాలు ఆచరించినట్లు మహా కుంభమేళా అధికారులు ప్రకటించారు. దాదాపు 10 వేల ఎకరాల కుంభనగర్‌లో ఎటుచూసినా భక్తగణమే కనిపిస్తున్నారు. సంక్రాంతి తరువాత వచ్చే ఉత్తరాయణ పుణ్య తిథి.. ఫిబ్రవరి 3వ తేదీన వచ్చే వసంత పంచమి. ఆ రోజు కూడా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది విదేశీయుల గురించి. సామాన్యులు, సాధువులు, అఖాడాలతో కలిసి పుణ్యస్నానం ఆచరించేందుకు అమెరికా, యూరప్, ఇతర దేశాల నుంచి తరలి వస్తున్నారు. బహుశా తాము గత జన్మలో భారత్‌లో పుట్టి ఉంటామంటూ సగర్వంగా చెప్పుకుంటున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేయడం తమకు దక్కిన వరం అని సంబరపడిపోతున్నారు ఫారెనర్స్. పైగా.. ఏర్పాట్లు కూడా అంతే ఘనంగా చేసింది యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం. ఈసారి 40 కోట్ల మంది వస్తారనే అంచనాలతో.. అంతకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేశారు. ఇక సంధ్యాసమయంలో త్రివేణీ సంగమం ఘాట్ వద్ద నదీమతల్లికి ఇచ్చే హారతుల్ని చూసేందుకు రెండు కళ్లూ చాలడం లేదు.

### గుండె తరలింపునకు మెట్రో సంస్థ గ్రీన్‌కారిడార్

హైదరాబాద్,గుండె ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ కోసం చేపట్టిన ప్రక్రియలో హైదరాబాద్ మెట్రో కీలక పాత్ర పోషించింది. నగరంలోని ఎల్‌బీనగర్‌లో ఉన్న కామినేని ఆస్పత్రి నుంచి దాత గుండెను లక్డీకపూల్‌లో ఉన్న గ్లెనిగెల్స్ గ్లోబల్ ఆస్పత్రికి అత్యంత వేగంగా తరలించారు. దీని కోసం హైదరాబాద్ మెట్రో సంస్థ గ్రీన్‌కారిడార్‌ను ఏర్పాటు చేసింది. ఎటువంటి ఆటంకాలు, ఆలస్య లేకుండా.. అతివేగంగా దాత గుండెను ట్రాన్స్‌పోర్ట్ చేసింది. గ్రీన్ కారిడార్ ద్వారా సుమారు 13 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 13 నిమిషాల్లోనే చేరుకున్నారు. ఈ రూట్లో 13 స్టేషన్లు దాటేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. గుండె తరలింపులో ఆలస్యం కావొద్దు అన్న ఉద్దేశంతో మెట్రో రైలులో దాన్ని పంపింపారు. జనవరి 17వ తేదీన రాత్రి 9.30 నిమిషాల సమయంలో మెట్రో రైలు ద్వారా డోనార్ గుండెను తరలించారు.

# డిప్యూటీ సీఎంగా లోకేష్? టీడీపీ రహస్య అజెండా ఇదేనా?

అమరావతి,కూటమిలో కొత్త నినాదం వినిపిస్తోంది. ప్రధానంగా టీడీపీలో కొత్త రాగం ఎత్తుకున్నారు టీడీపీ శ్రేణులు. కొత్త రాగం వెనుక ఎన్నో కారణాలు ఉన్నాయని టాక్. ఓ వైపు ఏపీలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో రోజురోజుకు ప్రజాదరణ పొందుతున్నారు. అందుకే టీడీపీలో ఒక్కసారిగా ఆ డిమాండ్ వినిపిస్తోందని రాజకీయ విశ్లేషకుల అంచనా. పవన్ కు చెక్ పెట్టేందుకు ప్లాన్ అమలులో భాగంగా ఈ రకమైన డిమాండ్ వినిపిస్తుందని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మరి ఆ డిమాండ్ ఏమిటి? దాని వెనుక ఉన్న కథ ఏమిటో చూద్దాం. కూటమిలో టీడీపీ, జనసేన మైత్రి బంధం చూసి ఇరుపార్టీల నాయకులు మురిసిపోతుంటారు. ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా కల్పించి సీఎం చంద్రబాబు తన పెద్దరికాన్ని నిలబెట్టుకున్నారు. అంతేకాదు ఎప్పుడు వీరిద్దరు కలిసినా ఆ పలకరింపులు కూడ వేరు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చేందుకు పవన్ కళ్యాణ్ ఇచ్చిన సపోర్ట్ అంతా ఇంతా కాదన్నది ఎవరూ కాదనలేని విషయం. అందుకే సీఎం చంద్రబాబు కూడ పవన్ కు ఇచ్చే ప్రాధాన్యత కూడ అదే స్థాయిలో ఉంటుంది. అలాగే పవన్ కూడ సినిమా రంగం నుండి రాజకీయాల్లోకి వచ్చినా అనతి కాలంలోనే రాజకీయాన్ని అర్థం చేసుకున్నారని చెప్పవచ్చు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడుతూ, నిరంతరం ప్రజలతో మమేకమవుతూ తన చరిష్మాను పవన్ పెంచుకున్నారు. తన ప్రసంగంలో కూడ గతానికి నేటికీ చాలా తేడా ఉందని కూడ జనసేన అభిమానుల అభిప్రాయం. ఇప్పటి వరకు ఏ మంత్రి కూడ పర్యటించని మన్యంలో పవన్ పర్యటన అయితే ఓ రేంజ్ లో పేరు తెచ్చిందని చెప్పవచ్చు. అంతేకాదు పర్యటనతో ఆగకుండ అక్కడ అభివృద్ధి పనులు కూడ అంతేస్థాయిలో సాగిస్తున్నారు పవన్. ఇలా పవన్ ఏది చేసినా ఆయన క్రేజ్ రోజురోజుకు ఆకాశాన్ని తాకుతూ ఉందన్నది విశ్లేషకుల అంచనా. ఇదే ఇప్పుడు టీడీపీలోని నాయకులకు రుచించడం లేదో ఏమో కానీ, ఉన్నట్లుండి మంత్రి నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మొన్న మహాసేన రాజేష్, నేడు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డిలు ఈ అంశాన్ని తెరమీదికి తెచ్చారు. శ్రీనివాస్ రెడ్డి అయితే ఏకంగా సీఎం చంద్రబాబు ముందే లోకేష్ అంశాన్ని లేవనెత్తారు. రోజురోజుకూ లోకేష్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలన్న




డిమాండ్ అధికం అవుతుండగా, కూటమిలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. సీఎం చంద్రబాబు ఎన్నో సమీకరణాలు పరిశీలించి మంత్రి పదవి వరకే లోకేష్ ను స్థిరపరిచారని, ఎవరెన్ని చెప్పినా ఆ ప్రయత్నం జరిగేది లేదంటూ ప్రచారం సాగుతోంది. పవన్ కళ్యాణ్ బలోపేతం అవుతుండడంతోనే, లోకేష్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలన్న డిమాండ్ తెచ్చి సమాన హోదా కల్పించాలని టీడీపీ క్యాడర్ కోరుతున్నట్లు కూడ ఏపీలో మరో ప్రచారం ఊపందుకుంది. మరి టీడీపీ అధినాయకత్వం వీటికి ఫుల్ స్టాప్ పెట్టకపోతే కొత్త తలనొప్పులు వస్తాయని కుండబద్దలు కొట్టేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇంతకు ఏం జరుగుతుందో తెలియాలంటే, మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

### ఇంకా కొలిక్కిరాని మంచు కుటుంబం వివాదాలు

హైదరాబాద్, మంచు కుటుంబంలో వివాదాల ఎపిసోడ్ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే కేసుల పరంపరం కొనసాగుతుండగా.. తాజాగా మనోజ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. వివాదానికి ఎండ్ కార్డ్ వేసేలా ఈ ట్వీట్ ఉంది. చర్చలకు అన్న విష్ణును ఆహ్వానిస్తూ మనోజ్ ట్వీట్ చేశాడు. 'రండి ఇద్దరు కలిసి కూర్చొని మాట్లాడుకుందాం. నేను ఒక్కడినే వస్తాను. ఏ ప్లేస్‌కైనా వస్తాను. ఎవరినో అడ్డం పెట్టుకుని మాట్లాడాల్సిన అవసరం నాకు లేదు. నాన్నని, మహిళ, సిబ్బందిని అడ్డం పెట్టుకుని మాట్లాడాల్సిన అవసరం లేదు. మన వద్ద ఉన్న సమస్యకు ఒక పరిష్కారం తీసుకొని వద్దాం. ఆరోగ్యకరమైన వాతావరణంలో చర్చలు జరుపుకుందాం.' అంటూ మనోజ్ ట్వీట్ చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com